# మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవన రేఖలు



విరసం

# మార్క్సిస్టు

## మహోపాధ్యాయుల

# జీవన రేఖలు

విరసం ప్రచురణ
2016

మార్క్సిస్టు మహోపాధ్యాయుల

# జీవనరేఖలు

Marxist Mahopadhyaayula

Jeevana Rekhalu

విరసం ప్రచురణలు
Website : www. virasam. in
Mail Id : arunatara1977@gmail. com
Like Page://arunatara viplava rachayitala sangham

మొదటి ముద్రణ : డిసెంబర్, 2015

వెల : 20/-

కవర్ డిజైన్ : క్రాంతి

డిటిపి : సహచరులు

లేఅవుట్ : ఆర్. భాగ్యలక్ష్మి

ప్రతులకు :

పాణి

50-348, ఎల్ 19, బి-2,

అరోరా నగర్, బి క్యాంప్,

కర్నూల్ - 2, ఆంధ్రప్రదేశ్.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ముందుమాట | ... | 5 |
| కారల్ మార్క్స్ | ... | 7 |
| ఫ్రెడరిక్ ఏంగెల్స్ | ... | 13 |
| వ్లదిమీర్ ఇల్యిచ్ లెనిన్ | ... | 19 |
| స్టాలిన్ | ... | 24 |
| మావో సే-టుంగ్ | ... | 33 |

# ముందుమాట

మానవ నాగరికతా చరిత్రలో మార్క్సిజం సాధించిన విజయం మనకు తెలిసినదే. 'ప్రపంచాన్ని వ్యాఖ్యానించడం మాత్రమే సరిపోదు. దానిని మార్చాలి' అని మార్క్సిజం లక్ష్యంగా ప్రకటించింది. సామాజిక ఆచరణకు ప్రాధాన్యత ఇచ్చి మార్గదర్శకత్వం వహించింది.

మార్క్సిజం శ్రామిక వర్గ దృక్పథం. వర్గరహిత సమాజ స్థాపనకు వర్గపోరాట సిద్ధాంతంగా విప్లవాత్మక ప్రాతిపదికను అందించింది. స్థలకాల సంబంధంలో నిరంతరం రాటుదేలిన మార్క్సిజం అత్యుత్తమ విజ్ఞానశాస్త్రంగా నిరూపితమైంది.

సమాజాభివృద్ధికి అనుగుణంగా మార్క్సిజం లెనినిజంగానూ, లెనినిజం మావోయిజంగానూ గుణాత్మకంగా అభివృద్ధి చెందిన వర్గపోరాట సిద్ధాంతం ప్రపంచ కార్మిక వర్గం చేతికి అద్భుతమైన ఆయుధమై ఎంతో పురోగమించింది.

మార్క్స్, ఏంగిల్స్ చేత 1848 ఫిబ్రవరిలో కమ్యూనిస్టు ప్రణాళిక రూపొంది 165 సంవత్సరాల కాలంలో మానవ సమాజాన్ని గొప్పగా ప్రభావితం చేసి సోషలిజం నిర్మించింది. విప్లవ పురోగమనానికి బాటలు వేసింది. గత చరిత్రను ప్రకృతి, సమాజాల అభివృద్ధి నియమాలకు అనుగణంగా వివరించి విశ్లేషించింది. వివిధ సామాజిక వ్యవస్థలను, అంతర్జాతీయ వైరుధ్యాలను లోతుగా అధ్యయనం చేసి పెట్టుబడిదారీ సమాజంలో కార్మిక వర్గాన్ని విప్లవకర వర్గంగా మార్క్స్, ఏంగిల్స్‌లు గుర్తించారు. ప్రకృతిలో భాగంగా ఉత్పత్తి క్రమంలో తన ముద్రను సుస్థిరం చేసుకున్న మానవులు ఒక సమాజంగా మనగలగడంతో పాటు సామాజిక వైరుధ్యాలతో కూడా వ్యవహరించడం నేర్చుకున్నారు. 19, 20 శతాబ్దాలలో సిద్ధాంత రాజకీయాలు వినూత్న మార్పులకు గురయ్యాయి. వాటికి పునాదిగా ఉన్న పెట్టుబడిదారీ ప్రపంచంలో ఎన్నో మార్పులు సంభవించాయి. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద దశలోకి ప్రవేశించి పతనం వైపు పరుగులు తీస్తుంది. రెండు ప్రపంచ యుద్ధాలు, రష్యా, చైనా, వియాత్నం విప్లవాలు తూర్పు యూరప్ విముక్తి ఇంకా ఎన్నో దేశాల్లో ప్రజాస్వామిక విప్లవాలు జరిగాయి. ఈ కాలంలో మార్క్సిజం లెనినిజంగా, మావోయిజంగా గుణాత్మకంగా ఎదిగింది.

ప్రపంచ సోషలిస్టు విప్లవ కర్తవ్యాల పరిపూర్తికి రష్యాలో లెనిన్, స్టాలిన్ సోషలిస్టు సమాజ నిర్మాణాన్ని ఆచరణలో సుసాధ్యం చేసి మార్క్సిజం అజేయమని చాటి చెప్పారు. కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనా విప్లవం విజయం సాధించడంతో పాటు ప్రపంచంలో వలస, అర్ధవలస దేశాలకు విప్లవ మార్గాన్ని చూపింది. సోషలిస్టు సమాజ పురోగమనంలో ఉపరితలంలో వర్గపోరాటమే కీలక లింకుగా ఉంటుందని

అనుభవపూర్వకంగా అర్థం చేయించింది. అదే గొప్ప శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం.

మార్క్సిజం ఒక సిద్ధాంతంగా అభివృద్ధి చెంది, కార్మిక వర్గ అగ్రగామి దళంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాలు ఏర్పడి విజయాలు సాధించాయి. పారిస్ కమ్యూన్ నుండి చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవం వరకు ఎన్నో సృజనాత్మకమైన నూతన విప్లవకర ప్రతిపాదనలు (పదునైన విప్లవకర ఆయుధాలు) మార్క్సిస్టు ఆయుధాగారంలోకి వచ్చి చేరాయి. రష్యా, చైనా, తూర్పు యూరప్‌లో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగి మార్క్సిస్టు వ్యతిరేక ధోరణులు ప్రబలమయ్యాయి. పోస్టు మాడర్నిస్టు సిద్ధాంతాలు విజృంభించాయి. ఈ రెండు శతాబ్దాల కాలంలో మార్క్సిజాన్ని వ్యాపింప చేయడంతో పాటు పరిరక్షించడం కోసం సమర్థవంతంగా నిర్వహించబడింది. ఈనాడు అది మన చేతిలో ఒక మార్గదర్శక ఆయుధంగా నిలిచింది.

మార్క్సిజం పిడివాదం కాదు. ఆచరణాత్మకంగా సమస్యలు పరిష్కరించే సాధనం. కాలం చెల్లిన వాటిని తొలగించి నూతన అనుభవాలు, నూతన ప్రతిపాదనలు, నిర్ధారణలతో మార్క్సిజం నిరంతరం సుసంపన్నమైంది. అందుకే మార్క్సిజం–లెనినిజం–మావోయిజం ఆచరణకు మార్గదర్శి.

మార్క్సిస్టు మహోపాధ్యాయులు మానవ సామాజిక చరిత్రలో వర్గ పోరాటానికి ఉన్న పాత్రను, ప్రాధాన్యతను గురించి సరైన మార్గంలో సిద్ధాంతీకరించి, ఆచరణలో సారథ్యం వహించి విజయాలు సాధించడంలో కీలకపాత్ర వహించారు. ప్రపంచ సోషలిస్టు విప్లవ పురోగమనానికి బాటలు వేశారు. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో మామూలు వ్యక్తులే అయినా చరిత్ర పురోగమనంలో నిర్వహించిన పాత్ర వల్ల వారు శక్తివంతులయ్యారు. వారు మనకు మార్గదర్శకులయ్యారు.

ఆ మార్గంలో మనం పురోగమించేందుకు వారి నుండి నేర్చుకోవాలి. వారి జీవితం తెలుసుకోవాలి. ఈ జీవన రేఖలు అందుకు ఉపయోగపడతాయి. ఇవి వేర్వేరు విప్లవ పత్రికల్లో గతంలో అచ్చయిన రచనలు.

నూతన సమాజ నిర్మాణానికి పురోగమించాలంటే మనం మన మార్గదర్శులయిన మార్క్సిస్టు మహోపాధ్యాయుల నుంచి నేర్చుకోవాలి. సిద్ధాంత ఆచరణలు రెండింటిని సమన్వయించుకోవాలి. అందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుంది.

**విరసం**

20 డిసెంబర్ 2015

# మానవ సమాజ పరిణామ చరిత్రను శాస్త్రీయంగా ఆవిష్కరించిన కారల్ మార్క్స్ జీవితం చిరస్మరణీయం

**(జననం: 5 మే, 1818 – మరణం: 14 మార్చి, 1883)**



కారల్ మార్క్స్ 1818 మే 5వ తేదీన జర్మనీ దేశపు రైన్‌లాండ్ ప్రాంతంలోని ట్రయర్ నగరంలో జన్మించాడు. 1883 మార్చి 14న మరణించాడు. మార్క్స్ జీవించిన కాలం చిన్నదే. గత కాలాన్నీ, వర్తమానాన్ని లోతుగా విశ్లేషిస్తూ చేసిన అధ్యయనంతో భవిష్యత్‌కు నూతన బాటలు వేయగలిగాడు. మార్క్స్ రూపొందించిన సిద్ధాంతాలు, నిర్మించిన పార్టీ, ఉద్యమ కార్యాచరణ మార్క్సిజంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి వెలుగొందుతుంది.

మార్క్స్ జీవితం విజ్ఞానదాయకం. స్కూలు జీవితంలోనే తెలివిగల విద్యార్థి. ప్రాచీన సాహిత్యం, జర్మన్ భాష, చరిత్ర పాఠాలలో ప్రతిభతో పాటు గణితంలో అమోఘ ప్రజ్ఞను చూపాడు. ఒక వ్యాసంలో "ప్రజలందరి మేలుకోరి పని చేస్తూ ఆ క్రమంలో అభివృద్ధి చెందిన వారినే చరిత్ర మహానుభావులుగా గుర్తిస్తుంది" అని వృత్తి ఎంపికలో తన భావాల్ని రాసి మెరిపించాడు. ఈ మాటలకు నూరు శాతం కట్టుబడిన వ్యక్తి మార్క్స్.

1839లో "డెమక్రటిస్–ఎపిక్యురస్ ప్రకృతి తత్వాల మధ్య వ్యత్యాసం" అన్న అంశంపై తన డాక్టరేట్ పరిశోధన ప్రారంభించాడు. వారి భౌతికవాద దృక్పథాన్ని లోతుగా అర్థం చేసుకుని విశ్లేషించాడు. తన థీసిస్‌ను అభివృద్ధి నిరోధక సిద్ధాంత వేత్తలు తిష్ట వేసి ఉన్న బెర్లిన్ యూనివర్సిటీకి సమర్పించడం అప్రతిష్టగా భావించి జేనా యూనివర్సిటీకి సమర్పించాడు. తనకు ఎంత అధ్యయనం వుందో అంత మేధాశక్తి, నిశిత దృష్టి ఉన్నాయని ప్రశంసలందుకున్నాడు. 24 సంవత్సరాల వయస్సుకే (1841కే) సునిశితమైన తాత్విక చిత్తశుద్ధి, పదునైన వాక్చాతుర్యంతో మధ్య యుగాల మత రాజకీయాలకు చివరి దెబ్బ కొడతాడనీ, రూసో, వాల్టేర్, హాల్బక్, లెసింగ్, హైనా, హెగెల్ వీరందరూ డాక్టర్ మార్క్స్‌లో వున్నారని మిత్రులు యువ హెగెలియన్లు నమ్మారు.

హెగెల్ తాత్విక ప్రభావంలో యువ హెగెలియన్‌గా వున్న మార్క్స్‌ను ఫ్యూయర్‌బా రాసిన 'క్రైస్తవ మత సారాంశం' బాగా ఆకర్షించింది. హెగెల్ తత్వశాస్త్రంలోని కొన్ని అంశాలను విమర్శనాత్మకంగా మెరుగుపరచిన ఫ్యూయర్‌బా ప్రపంచ అంతస్సారాన్ని మతం, హెగెల్ భావవాదం గ్రహించలేదని ఖచ్చితంగా తేల్చి చెప్పాడు. 'మనిషి ఉనికికి మూలం ప్రకృతి మాత్రమే' అన్న భౌతికవాదాన్ని విశ్వసించడంతోపాటు దేవుడ్ని, మతాన్ని మనిషే సృష్టించాడన్న ఫ్యూయర్‌బా తర్కంలోని నిజాన్ని గుర్తించిన మార్క్స్, మనిషిని సామాజిక జీవిగా చూడకుండా ప్రాణం ఉన్న పదార్థంగానే చూసే పరిమితి కారణంగా ఫ్యూయర్‌బా సమాజాన్ని, చరిత్రను విస్మరించాడని అర్థం చేసుకున్నాడు. ఈ రకమైన విమర్శనాత్మక దృష్టి, సమగ్ర అవగాహన మార్క్స్‌లో పరిపక్వం కావడానికి రాజకీయ కార్యకలాపాలు దోహదం చేశాయి. ప్రసిద్ధ సోషలిస్టు సిద్ధాంతవేత్తల చార్లెస్ ఫొరియర్, సైంట్ సైమన్, రాబర్ట్ ఓవెన్‌ల రచనలు చదివాడు. వారంతా పెట్టుబడిదారీ సమాజంలోని దురన్యాయాలనూ, దౌర్భాగ్య లక్షణాలనూ, కుళ్లును విమర్శించి ఎండగట్టి దోపిడీ పీడనలు లేని సుహృద్భావ మానవ సమాజ స్థాపనకు కలలు కన్నారు. వారి సిద్ధాంతాలకు శాస్త్రీయ ప్రాతిపదిక లేదనీ, వారు కార్మిక శక్తినీ, వర్గపోరాట అవసరాన్ని గుర్తించకుండా, పాలకులు, యజమానులు దయాదాక్షిణ్యాలను ప్రదర్శించాలని కోరుకున్నారని వారు చేప్పే మార్గాలు పరిష్కారానికి పనికి రావని మార్క్స్ గుర్తించాడు.

బ్రస్సెల్స్ తిరిగి వచ్చిన మార్క్స్, ఏంగెల్స్ ఇద్దరూ కృషి చేసి 'జర్మన్ ఐడియాలజీ' అనే సిద్ధాంత చర్చా గ్రంథాన్ని రచించారు. తొలిసారిగా గతితార్కిక చారిత్రక భౌతికవాదానికి సమగ్రమైన, క్రమబద్ధమయిన మూలసూత్రాలు రూపొందించారు. హెగెల్ గతితార్కాన్నీ, ఫ్యూయర్‌బా భౌతికవాదాన్ని అభివృద్ధి చేసి గతితార్కిక భౌతికవాదాన్ని రూపొందించి సామాజిక చరిత్రకు అన్వయించి చారిత్రకంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని రూపొందించారు. మార్క్స్ సిద్ధాంతాన్ని – విప్లవ కార్యాచరణను మేళవించి 'ప్రపంచాన్ని మార్చాల'న్నాడు. ఈ గొప్ప విషయమే మార్క్స్ ప్రత్యేకతగా చరిత్ర పొడవునా తన జ్ఞానంగా నిలుపుకుంది.

యూరప్ దేశాల పరిస్థితి గురించి బాగా తెలిసిన మార్క్స్, ఏంగెల్స్‌లు దాని వర్గ స్వభావాన్ని పూర్తిగా గ్రహించారు. '1847లో లీగ్ ఆఫ్ జస్టిస్' ఆహ్వానం మేరకు అందులో చేరారు. దాని పునర్వ్యవస్థీకరణకూ, కార్మికవర్గ పార్టీ స్థాపనకు ఎంతో కృషి చేశారు. సరికొత్త దృక్పథానికీ, విజ్ఞానానికీ అనుగుణంగా కేంద్రీకృత ప్రజాస్వామిక నిర్మాణ సూత్రాలను రూపొందించారు. దానిని కమ్యూనిస్టు లీగ్‌గా ప్రతిపాదించడంతో పాటు "ప్రపంచ కార్మికులారా, ఏకంకండి" అనే అంతర్జాతీయ స్వభావంతో కూడిన

నినాదాన్నిచ్చారు. 1847 జూన్‌లో లండన్‌లో కమ్యూనిస్టు లీగ్ ప్రథమ మహాసభ జరిగింది. కానీ మార్క్స్ తిండికి కూడా లేని ఆర్థిక ఇబ్బందుల వలన హాజరు కాలేదు. అయితే పేరు, నినాదం ఆమోదం పొంది ఒక కార్మికవర్గ పార్టీ ఏర్పాటుకు పునాదులు పడ్డాయి. అదే సంవత్సరం నవంబర్ 29న ప్రారంభమైన అంతర్జాతీయ మహాసభ ఎనిమిది రాత్రులు జరిగింది. పగలు శ్రమ చేసి రాత్రి సభలకొచ్చారు ప్రతినిధులు. నిబంధనావళి, సిద్ధాంత సూత్రాలు ఏకగ్రీవంగా ఆమోదించడంతో పాటు ఒక ప్రణాళికను రూపొందించమని మార్క్స్, ఏంగెల్స్‌లను మహాసభ కోరింది. 1848 ఫిబ్రవరిలో 23 పేజీల చిన్న సాదా పుస్తకం 'కమ్యూనిస్టు ప్రణాళిక' వెలువడింది. మానవ చరిత్రలో మున్నెన్నడూ, తర్వాత కూడా అంత మహత్తర ప్రభావం వేసిన పుస్తకం కానరాలేదు. కమ్యూనిజాన్ని అప్పటికే ఐరోపాలోని రాజ్యాలు ఒక శక్తిగా అంగీకరించాయి.

రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనంలో బ్రిటీష్ మ్యూజియం లైబ్రరీ మార్క్స్‌కు ఒక యుద్ధ భూమిగా మారింది. పెట్టుబడిదారీ అర్థశాస్త్ర అధ్యయనం కొద్ది నెలల్లో పూర్తవుతుందనుకున్నాడు. ఎప్పటికప్పుడు కొత్త ప్రశ్నలు రావడంతో మళ్లీ చదివి ఆదర్శప్రాయమైన అధ్యయనంతో, నేర్చుకోవాలన్న తపనతో వాటిని విమర్శనాత్మకంగా పరిశీలించి స్పష్టీకరించుకోవలసి వచ్చింది.

వలసవాద వ్యతిరేక పోరాటాలకు (ఇండియా, చైనా), ఐర్లాండ్ పోరాటానికి మద్దతుగా రాసిన వ్యాసాల్లో వలస దేశాల్లోని విముక్తి పోరాటాలన్నింటిని కార్మిక వర్గం బలపరచాలన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

1857-58 ఆర్థిక సంక్షోభం అనంతరం అమెరికా, యూరప్ విప్లవాలు ఉవ్వెత్తున లేచాయి. మొత్తం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కంపించిపోయింది. వందల సంఖ్యలో సంస్థలు దివాళా తీసాయి. నిరుద్యోగం ప్రబలిపోయింది. బూర్జువా ఆర్థిక వేత్తల ప్రయత్నాలు ఏమి చేసినా ఫలించవని మార్క్స్ జోస్యం నిజమయింది. సంక్షోభాలకు ఈ వ్యవస్థే మూలమని స్పష్టం అయింది. 1861-65 అమెరికా అంతర్యుద్ధం, 1863-64 ఆస్ట్రియా పాలనకు వ్యతిరేకంగా పోలెండ్‌లో ప్రజావెల్లువ, రష్యాలో వచ్చిన తీవ్రమైన మార్పులు, ఇటలీ సంఘటనలు ఇలానే ఎన్నో పోరాటాలు ప్రపంచ పరిణామాలలో చోటు చేసుకున్నాయి. ఇదే కాలంలో ముందుకొచ్చిన సంస్కరణవాదాన్ని (లాసెల్లియనిజం) ఓడించారు. పోలెండ్ ప్రజల సమస్యకు అంతర్జాతీయ దృక్పథంతో జర్మనీ కార్మికులు, ఇంగ్లీషు, ఫ్రెంచి కార్మికులు అందించిన సహకారం వెనుక మార్క్స్ చేసిన విశ్లేషణ, రాజకీయ ప్రచారం ఉన్నాయి.

మార్క్స్ ప్రోత్సాహంతో ఐరోపా కార్మికవర్గ మహోద్యమం ఒక అంతర్జాతీయ కార్మిక సంస్థ స్థాపనకు అవసరమైన ప్రాతిపదిక సృష్టించింది. 1864 సెప్టెంబర్ 28న అంతర్జాతీయ సమీకరణకు బాటలు వేసిన మార్క్స్ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.డబ్ల్యు.ఎ.) అవతరణను పరిపూర్తి చేయగలిగాడు. మొదటి ఇంటర్నేషనల్ నాయకుడుగా 1864-72ల మధ్య మార్క్స్ రాజకీయ కార్యాచరణ మకుటాయమానమైంది. అంతర్జాతీయ కార్మిక సంఘాధినేతగా, నిజమైన కార్మిక నాయకుడుగా, ప్రముఖ రాజకీయ వేత్తగా ఎన్నో విలువైన ప్రతిపాదనలు చేశాడు. వర్గ సౌహార్దత, కార్మికవర్గ అంతర్జాతీయతలకు ఐక్య కార్యాచరణ ఉత్తమ మార్గంగా అభివృద్ధి చేసి ఇంటర్నేషనల్ ప్రతిష్టను పెంచాడు.

నిరంతరం మార్క్స్, ఏంగెల్స్ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి. మార్క్స్ తన మిత్రునికి ఉత్తరం రాయని వారం లేదు. ఒకోసారి రోజూ రాసేవాడు. వారు లేఖల్లో రాసుకున్నదంతా దాదాపు తర్వాత కాలంలో యాథాతథంగా ప్రచురితమయింది. శాస్త్ర, రాజకీయ సమస్యల్నీ తత్వశాస్త్రం, అంతర్జాతీయ రాజకీయాలు, జీవశాస్త్రం, గణితం, చరిత్ర, రాజకీయ అర్థశాస్త్రం ఇలా అన్నింటినీ తమ రాతల్లో చర్చించేవారు. పరస్పర అంగీకారం లేని వాటికి విలువలేనట్లే. ఏంగెల్స్ మిలిటరీ శాస్త్రం, భాషా శాస్త్రం, జీవశాస్త్రంలలో లోతైన అధ్యయనం చేసినట్లు ఉత్తరాల ద్వారా తెలుస్తుంది. మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతంతోనే ఆగలేదు. సామాజిక మౌలిక వైరుధ్యాలను, వర్గపోరాట ప్రాధాన్యతను, నూతన సామాజిక నియమాలను చెప్పిన 'క్యాపిటల్' ప్రపంచ కార్మిక వర్గానికి అత్యంత ప్రాధాన్యత గల గ్రంథం. ఇటువంటి గ్రంథం మరొకటి రాలేదని ఏంగెల్స్ రాసాడు.

1870 జూలై 19న ఫ్రాన్స్, ప్రష్యాల మధ్య యుద్ధం మొదలైంది. జాతి దురభిమానం, బూర్జువా జాతీయత, సెంటిమెంట్లు రెండు దేశాల్లో పెచ్చరిల్లాయి. మార్క్స్ నాయకత్వంలో ఇంటర్నేషనల్ మాత్రం 'సైనిక తత్వాన్ని ప్రతిఘటించాలని' దేశ దేశాల కార్మికులకు సూత్రబద్ధమైన పిలుపునిచ్చింది. అనేకానేక పరిణామాలూ, ఆర్థిక-రాజకీయ సంక్షోభాల పర్యవసానంగా 1871 మార్చి 18న పారిస్ కార్మికులు అధికారాన్ని హస్తగతం చేసుకుని సిటీ హాలుపై అరుణపతాకాన్ని ఎగురవేశారు. సైనికులలో అత్యధికులు కార్మికులతో కలసిపోయారు. చరిత్రలో మొదటిసారి కార్మికవర్గం అధికారానికొచ్చింది. కమ్యూన్ ఆవిర్భావాన్ని అధికారికంగా ప్రకటించింది. వారి పట్టుదల, చొరవ, త్యాగనిరతి, పట్టువిడుపులను మార్క్స్ శ్లాఘించాడు. "ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం" రచనలో చారిత్రక పరిస్థితుల్ని వివరంగా చర్చించాడు. రష్యన్ పెటీ

బూర్జువా విప్లవ ప్రవాసి బకూనిన్ అరాచకవాదంతో ఇంటర్నేషనల్‌ను చేజిక్కించుకునేందుకూ, శాస్త్రీయ కమ్యూనిజంతో తగాదాకు దిగాడు. అరాచకవాదుల, ఒంటెత్తువాదుల భావాలను తిప్పికొడుతూ మార్క్స్ పారిస్ కమ్యూన్ అనుభవాన్ని, ఇంటర్నేషనల్ అనుభవాన్ని గుర్తు చేశాడు. సిద్ధాంతంతోపాటు పార్టీ ఉంటేనే రాజ్యాధికారం గెలుచుకుని సోషలిస్టు పరివర్తన సాధించగలదని రుజువైన సత్యాన్ని శాస్త్రీయంగా వివరించాడు.

మార్క్స్ రచనల్లో 'కమ్యూనిస్టు ప్రణాళిక', 'క్యాపిటల్' తర్వాత 'గోథా కార్యక్రమ విమర్శ'కు అంతటి ప్రాధాన్యత వచ్చింది. "జర్మన్ వర్కర్స్ పార్టీ కార్యక్రమంపై స్థూల వ్యాఖ్యలు" అన్నదే ఆ పుస్తకం. ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు కార్మికవర్గ నియంతృత్వంకు ఎంత తేడా వుందో వివరించాడు. కార్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వం లేకుండా సోషలిజం రాదనీ, అటువంటి అద్భుతాలు జరగవనీ, ఆ భ్రమలు పనికి రావని చెపుతూ కార్మికవర్గం అలా ఆలోచించడం ప్రమాదకరం, వినాశనాన్ని కోరి తెచ్చుకోవడమేననీ బలంగా చెప్పాడు. రెండు దశల అభివృద్ధిని చెప్పి మొదటి దశ అయిన సోషలిస్టు దశలో 'పనిని బట్టి ప్రతిఫలమివ్వడం' జరగాలని, రెండవ దశలో 'ప్రతి ఒక్కరికి శక్తిని బట్టి పని, అవసరాన్ని బట్టి ప్రతిఫలం వుంటుందని' సామాజికాభివృద్ధిని సూచించాడు.

మార్క్స్‌కు అన్ని కష్టాల్లోనూ తోడునీడగా నిలిచిన ప్రియాతి ప్రియమైన జెన్నీ 1881 డిసెంబర్ 2న మరణించడంతో మార్క్స్ కోలుకోలేని దెబ్బతిన్నాడు. అయినా విప్లవ కార్యక్రమాన్ని మరికొంత కాలం ఆయన దీక్షగా చేసినా జెన్నీ లేని మార్క్స్‌లో ఆ వెలుగు కానరాలేదు. మార్క్స్ నూతన ప్రాపంచిక దృక్పథం శాస్త్రీయ కమ్యూనిస్టు సమాజాన్ని వాగ్దానం చేయడమేకాదు, చరిత్రలో సాధ్యమైన సత్యాన్ని మన ముందుకు తెచ్చింది. కార్మికవర్గ పార్టీ, కార్మికవర్గ నియంతృత్వం ఆవశ్యకతను పారిస్ కమ్యూన్ గుణపాఠంగా నొక్కి చెప్పిన మార్క్స్ చారిత్రక దృష్టి సునిశితమైనది. ప్రపంచ కార్మికవర్గ నేతగా ఎదిగిన మార్క్స్ శత్రువుల గుండెల్లో గుబులు పుట్టించాడు. మార్క్స్ ఎన్నోసార్లు బహిష్కరణలనూ, నిర్బంధాలనూ, ఆర్థిక ఇబ్బందులనూ, అనారోగ్య సమస్యలనూ ఎదుర్కొని మొక్కవోని దీక్షతో కృషి చేశాడు. మార్క్స్ రచనా వ్యాసంగం, గ్రంథ రచన, ఏంగెల్స్‌తో మైత్రి, ఉద్యమాలలో చురుకైన మార్గదర్శక పాత్ర చిరకాలం నిలిచి ఉంటాయి. ఆకలి దారిద్ర్యాల మధ్యనే నిరంతరం కృషి చేస్తూ ప్రాపంచిక చిరకాల జ్ఞాపకంగా జ్ఞానాన్ని వెలిగించిన మార్క్స్ మహనీయుడు. భవిష్యత్ తరాల చరిత్రకు దిక్సూచి అని అంతర్జాతీయ సమాజం నివాళులర్పించింది. మానవ సమాజ శాస్త్రీయ

పరిణామ చరిత్రకారుడు మార్క్స్. మార్క్స్ మరణానంతరం క్యాపిటల్ మిగిలిన భాగాలను ఏర్చి కూర్చి ఏంగెల్స్ ప్రచురించాడు. మార్క్స్ మిగిల్చిన కర్తవ్యాల పరిపూర్తికి అంకితమై కృషి చేశాడు. మార్క్స్ సంపూర్ణంగా వ్యక్తం కావడంలో వారిద్దరి అపూర్వ మైత్రి ఎంతో దోహదం చేసింది. చరిత్రలో అభివృద్ధి చెందిన లెనినిజం, మావోయిజం, రష్యా, చైనా విప్లవాలతో పాటు అనేక సామాజిక విప్లవాలు మార్క్సిజం కొనసాగింపే, మార్క్సిజం తాలూకు విస్తృత పరిణామమే.

ఇంతటి జ్ఞానాన్నీ, కార్యాచరణ మార్గాన్నీ అందించిన మన మార్గదర్శి మార్క్స్‌ను మన జ్ఞానంలో వెలిగించుకుంటూ, సరైన కార్యవిధానం ద్వారా మనల్ని మనం సంస్కరించుకుందాం. అదే మార్క్స్‌కు సరైన నివాళి కాగలదు.

# శాస్త్రీయ సోషలిజం నిర్మాతల్లో ఒకరు
# కామ్రేడ్ ఫ్రెడరిక్ ఎంగెల్స్

**(జననం: 8 నవంబర్, 1820 – మరణం: 5 ఆగస్టు, 1895)**



జర్మనీలోని రైన్ రాష్ట్రంలో బార్మెన్ ఒక పారిశ్రామిక నగరం. అక్కడ ఒక పారిశ్రామికవేత్త కుమారుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్. మాధ్యమిక పాఠశాలలో ప్రకృతిశాస్త్రం, భౌతికశాస్త్రం అధ్యయనం చేశాడు. ఉన్నత పాఠశాల విద్యను 'ఎల్బర్‌పెర్డ్'లో చదివినా పరీక్షలు రాయలేదు. తండ్రి చేసే వ్యాపారంలో 1839లో చేరాడు. తనకు ఇష్టంలేని పని ఇది. అయినాగాని చేయాల్సి వచ్చేది. తర్వాత కాలంలో అది ఒక అవసరంగా మారి, మార్క్స్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులను, విప్లవోద్యమ అవసరాలను తీర్చడంలో ప్రముఖపాత్ర వహించింది. ఒక పెట్టుబడిదారుడుగా ఉండడం ఏమాత్రం ఇష్టంలేని కార్మికవర్గ ప్రతినిధి ఎంగెల్స్.

ఆనాడు కార్మికవర్గం ఆవిర్భవించి బలపడడంతోపాటు, హెగెల్ తత్వశాస్త్రం ఎంగెల్స్ మీద బలమైన ప్రభావాలనేసాయి. తను యవ్వనంలోకి అడుగుపెడుతూనే సమాజ పరిణామాన్ని, తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసాడు. 1841లో ఒక సంవత్సరం బెర్లిన్ రక్షణశాఖలో ఉద్యోగిగా పనిచేసినపుడు సైనికశాస్త్రాన్ని అధ్యయనం చేసాడు. ఆ తర్వాత కాలంలోనే మార్క్స్ సలహా మేరకు ఇటాలియాన్ యుద్ధకాలంలో "సోనది–రైన్‌నది" అని ఒక కరపత్రాన్ని తనపేరు లేకుండా ప్రచురించాడు. అది సైనిక వర్గాల్లో మంచి ప్రభావాన్ని వేసింది. అది ఎవరో ఒక సైనిక నిపుణుడు రాశాడని చర్చించుకున్నట్లు తర్వాత కాలంలో మార్క్స్ చెప్పాడు.

ఆనాడు ప్రపంచంలోనే బాగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక పట్టణం ఇంగ్లాండులోని మాంచెస్టర్. అక్కడ చార్టిస్టు ఉద్యమం ఒక రాజకీయశక్తిగా, కార్మికుల విప్లవోద్యమంగా ప్రారంభమయ్యింది. 1942–43లో ఇక్కడ ఎంగెల్స్ 20నెలలు అర్థశాస్త్ర అధ్యయనానికి, ఆర్థిక విషయాల పరిశీలనకు వినియోగించాడు. కార్మికవర్గం అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్య పరిస్థితిని లోతుగా పరిశీలించిన ఎంగెల్స్ చలించిపోయాడు. వారిపట్ల పెరిగిన అభిమానంతో చార్టిస్టు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఆనాటి నుండి పారిశ్రామిక విధానాన్ని విమర్శిస్తూ చార్టిస్టుల పత్రికలోను, ఊహాజనిత సోషలిస్టులు నడుపుతున్న పత్రికల్లోను వ్యాసాలు రాయడం

ప్రారంభించాడు. ఎంగెల్స్ పరిశీలన, అవగాహన, చారిత్రక దృష్టిని లోతుగా, విస్తృతంగా పెంచిన గొప్ప రచన, "ఇంగ్లాండులో కార్మికవర్గ స్థితిగతులు" అనే తొలి గ్రంథం ఈ కాలంలో 1845 రాసినదే. దాని వెనుక 21 నెలల కృషి ఉంది. గ్రేట్‌బ్రిటన్‌లో తమ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి బదులుగా ఎంగెల్స్ అక్కడి కార్మికుల పరిస్థితులను, పెంపొందుతున్న ఉద్యమాలను వివరాలతో సహా సేకరించాడు. చిన్నవయస్సులోనే లోతైన విశ్లేషణతో "ధనికులపై బీదల యుద్ధం" ప్రత్యక్షమై సార్వత్రికంగా మారుతుందని నొక్కి చెప్పాడు.

1944లో ఎంగెల్స్ మాంచెస్టర్ వెడుతూ దారిలో కొలోన్‌లో ఆగి, మార్క్స్‌తో కలిసి మాట్లాడి పరిచయం చేసుకున్నాడు. ఆనాటి పరిచయం ఇరువురి స్నేహానికి, విశ్వకళ్యాణానికి తొలిమెట్టు. మాంచెస్టర్ నుండి ఎంగెల్స్ తిరిగి వెడుతూ పారిస్‌లో కొద్దిరోజులు ఆగి మార్క్స్‌తో కలిసి ఉన్నాడు. వారిమధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. వారిద్దరి అభిప్రాయాల్లో సారూప్యత ఉండడం కారణంగా చాలా విషయాల్లో ఏకాభిప్రాయానికి రాగలిగారు. అప్పటినుండి వారిమధ్య గాఢమైన స్నేహం ఏర్పడింది. వీరి భావాల్లోని ఐక్యత అసాధారణ మైత్రీ బంధానికి తోడ్పడింది.

యువ వామపక్ష హెగెలియన్లు కమ్యూనిజాన్ని, ప్రజాతంత్ర భావాలను వ్యతిరేకించడంతో వారినుండి విడిపోయి 1944లో మార్క్స్, ఎంగెల్స్‌లు 'పవిత్ర కుటుంబం' అనే గ్రంథాన్ని రాసారు. "క్రిటిసిజమ్ ఆఫ్ క్రిటికల్ క్రిటిసిజం" అని దానికి పేరు. ఇందులో ప్రజలే చరిత్ర నిర్మాతలని, సమాజ పరిణామానికి నిర్ణయాత్మకశక్తి ఆర్థిక ఉత్పత్తి అని రాశారు. శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంత రచనలో ఈ గ్రంథం తొలి అడుగుగా చెబుతారు. "సమాజానికి భౌతిక ఉత్పత్తి విధానమే పునాది"గా ఉంటుందని చెప్పింది ఇందులోనే.

1945-46లలో జర్మన్ తాత్విక ఆలోచన మీద మార్క్స్, ఎంగెల్స్ చేసిన గొప్ప కృషి ఫలితంగా వెలువడిన గ్రంథమే "జర్మన్ ఐడియాలజీ". ఈ ప్రసిద్ధ గ్రంథంలో శ్రామికవర్గం కమ్యూనిజం సాధించి తీరుతుందని స్పష్టపరిచారు. శాస్త్రీయ కమ్యూనిస్టు సిద్ధాంతానికి తాత్విక ప్రాతిపదికగా చరిత్రపట్ల భౌతికవాద దృక్పథాన్ని స్పష్టపరిచారు. గతంలో జరిగిన విప్లవాలు ఏవి కూడా వర్గాలను, వర్గపాలనను తొలగించలేదు. కమ్యూనిస్టు విప్లవం వర్గపాలనను, వర్గాలను అంతం చేస్తుందని విశదీకరిస్తూ (కార్మికవర్గం కూడా తనను తాను రద్దు చేసుకుంటుందని) అదొక్కటే సమాజ పురోగమన మార్గమని, సామాజిక చలన నియమాలు ఈ సత్యాన్నే రుజువుపరుస్తున్నాయని చెప్పారు. సమాజం పట్ల చారిత్రక దృష్టితో ఇరువురు తత్వశాస్త్రాభివృద్ధికి ఎంతో కృషి చేసారు. "జర్మన్ తత్వశాస్త్రం పుట్టి ఉండకపోతే శాస్త్రీయ సోషలిజం లేనేలేదు" అని ఎంగెల్స్ అన్నాడు. 1946లో బూర్జువా సోషలిస్టు

ప్రూడన్ రాసిన 'ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ' ఆనాడు పెట్టుబడాదారీ సోషలిస్టులు, విప్లవకారులపై బలమైన ప్రభావాన్ని వేసింది. మార్క్స్ సునిశిత రాజకీయ చర్చతో ప్రూడనిస్టు(పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ) సిద్ధాంతాలను విమర్శించాడు. వీరితో మార్క్స్, ఎంగెల్స్ 20 సంవత్సరాల సుదీర్ఘ చర్చ చేసారు. 'తత్వశాస్త్ర దారిద్ర్యం' పేరుతో ప్రూడనిజాన్ని ఓడిస్తూ ఒక గ్రంథం రాసారు. పెటీబూర్జువా ఊహా స్వర్గాన్ని చీల్చి చెండాడారు.

మార్క్స్, ఎంగెల్స్ చేసిన రచనలు ప్రామాణికమైనవి. ఎంగెల్స్ పేరుతోనే వెలువడినవి కూడా ఉన్నాయి. ఎంగెల్స్ రచనల్లో ప్రముఖమైనవి అనేకం ఉన్నాయి. అందులో ఒకటి డూరింగ్‌పై విమర్శ 'యాంటీ డూరింగ్' (డూరింగ్ ఖండన) పేరుతో ప్రచురితమయ్యింది. ఆ డూరింగ్ ఒక జర్మన్ పండితుడు. శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాల పేరుతో మార్క్స్‌ను ఖండిస్తూ చెత్త సిద్ధాంతాన్ని ఒక దానిని పుస్తకరూపంలో తెచ్చాడు. ప్రకృతి శాస్త్రాలను, భౌతిక, రసాయన శాస్త్రాలను, గణితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి శాస్త్ర ప్రమాణాలతో డ్యూరింగ్ తప్పుడు సిద్ధాంతాలను ఎంగెల్స్ తన రచన ద్వారా ఎండగట్టాడు. ఇందులో తత్వశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, సామాజిక శాస్త్రాల ప్రస్తావన ఉంది. అందులో మూడు భాగాలు తీసి "సోషలిజం–ఊహాజనితం–శాస్త్రీయం" అనే చిన్న పుస్తకంగా తెచ్చాడు.

1845లో ఎంగెల్స్ బ్రస్సెల్స్‌కు వెళ్ళి మార్క్స్‌తో కలిసి ఉన్నాడు. ఎంగెల్స్ జీవితంలో, శాస్త్రీయ సిద్ధాంత రచనావ్యాసంగంలో గణనీయమైన మార్పుకు అది ఎంతో ఉపయోగపడింది. అప్పటికే అక్కడ లీగ్ ఆఫ్ జస్టిస్ అనే సంస్థ ఉంది. మార్క్స్, ఎంగెల్స్ ప్రభావంతో 'అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం'గా ఏర్పడింది. 1847లో ప్రణాళిక గురించి చర్చించారు. 1848 ఫిబ్రవరిలో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ ప్రణాళిక "కమ్యూనిస్టు ప్రణాళిక" తయారయ్యింది. ప్రపంచ చరిత్రలో విశిష్ట ఖ్యాతిని పొందిన అతిచిన్న వుద్గ్రంథమిది. ఈపేరు సూచించింది ఎంగెల్స్. ఉమ్మడి అవగాహనతో ఎంగెల్స్ తయారుచేసిన చిత్తు ప్రతికి స్వల్పమైన మార్పులతో మార్క్స్ ఆమోదం, అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం ఏకగ్రీక ఆమోదం లభించాయి. మార్క్స్, ఎంగెల్స్‌లు కలిసి రచించిన ఈ రచన తర్వాత కాలంలో విప్లవాల దిక్సూచిగా నిలిచిపోయింది. సంఘటిత కార్మికవర్గానికి జీవం పోసిన ఈ ప్రణాళిక 'చరిత్రంతా 'వర్గపోరాటాల చరిత్ర' అంటు ప్రారంభమై, శాస్త్రీయ విశ్లేషణతో సమాజ పురోగామి చరిత్రను ఆవిష్కరించింది. మౌలికమైన వర్గ పోరాటాన్ని చోదకశక్తిగా కార్మికవర్గ క్రియాశీలపాత్రను విశదీకరించింది, కార్మికులు వర్గంగా రూపొంది, అధికారాన్ని చేపట్టి నియంతృత్వంతో వర్గరహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తూ తమను తాము ఒక వర్గంగా రద్దు చేసుకునే కార్యక్రమాన్ని ప్రకటించారు. "అది నేటికి

కూడా శ్రామికవర్గాన్ని ఉత్తేజపరచి నడుపుతుంది” అన్నాడు లెనిన్ మహాశయుడు. మరొకటి “గోథా కార్యక్రమం విమర్శ” గ్రంథం జర్మన్ పార్టీలోని అవకాశవాదానికి వ్యతిరేకంగా మార్క్స్ రాశాడు. గోథా కాంగ్రెస్ ముసాయిదాలోని ప్రతీ పదాన్ని విమర్శించవచ్చునని ఎంగెల్స్ పేర్కొన్నాడు.

1875-76లలో “డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్” (ప్రకృతి గతితర్కం) అనే గ్రంథాన్ని ఎంగెల్స్ రాశాడు. ఇది అసంపూర్తి రచనగానే మిగిలిపోయింది. ఇది 1927లో వెలుగు చూసింది. ఇందులోని తొమ్మిదవ అధ్యాయం “వానరుడు నరుడుగా మారిన పరిణామ క్రమంలో శ్రమ పాత్ర” మానవ స్వభావం, అభివృద్ధి గురించి మార్క్సిస్టు దృక్పథాన్ని ఉత్తమంగా వివరించింది. “శ్రమయే మానవుడిని సృష్టించింది. ప్రకృతి సూత్రాలను తెలుసుకొని సరిగా వినియోగించడం వలననే ప్రకృతిపై ఆధిపత్యం ఏర్పడింది” అన్నాడు ఎంగెల్స్.

ఎంగెల్స్ రాసిన ప్రామాణిక మార్క్సిస్టు గ్రంథాలలో ఉత్తమమైనది “కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక”. శాస్త్రీయ దృష్టితో సమాజ పరిణామాన్ని పరిశీలించిన ఉద్గ్రంథమిది. గతం, వర్తమానం పట్ల శాస్త్రీయ విప్లవభావనలు కలిగించే లక్ష్యంతో 1884లో ఈ రచన చేసాడు.

1885లో “లుడ్విగ్ ఫ్యూయర్‌భా సాంప్రదాయ జర్మన్ తత్వశాస్త్రం ముగింపు” వెలువడింది. హెగెలియన్ భావవాదం నుండి భౌతికవాదం గతితర్కం, యాంత్రిక భౌతికవాదం నుండి గతితార్కిక భౌతికవాదంల పరిణామాన్ని, పురోగతిని వివరిస్తుందిది.

చారిత్రాత్మకమైన 1525 నాటి జర్మన్ రైతాంగ తిరుగుబాటు గురించి ఎంగెల్స్ ‘జర్మనీలో రైతు యుద్ధం’ అనే గ్రంథాన్ని 1850లో రాశాడు. ఈ రచన ద్వారా రైతాంగం పాత్రను గుర్తించిన మార్క్స్, ఎంగెల్స్ జర్మన్ విప్లవం రైతాంగం మద్దతుపై ఆధారపడి విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు.

ఎంగెల్స్ రచనా వ్యాసంగంలో చెప్పుకోదగినవి మరికొన్ని ఉన్నాయి. చార్టిస్టు ఉద్యమ పత్రిక ‘నార్త్ స్టార్’కూ ఓవనైట్ (ఊహాజనిత సోషలిస్టు ఉద్యమం పత్రిక “నూతన నైతిక ప్రపంచం”కు అలాగే న్యూ రేనిష్ జేటుంగ్‌కు రాసిన రచనలు అనేకం ఉన్నాయి. ఏంగెల్స్ రచనల్లో అర్థశాస్త్ర విమర్శనా వ్యాసాలకు చాలా ప్రాధాన్యత ఉంది. గృహవసతి సమస్యలపై అద్భుతమైన వ్యాస పరంపరను రాశాడు.

1844-83ల మధ్య కాలంలో మార్క్స్, ఎంగెల్స్ మధ్య 1,386 ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. తర్వాత వాటిని నాలుగు సంపుటలుగా ప్రచురించారు. ఆ లేఖల్లో విషయాలు వారిద్దరి మధ్య నున్న భావసమైక్యతను, ఆచరణశీలతను గొప్పగా కళ్ళకుకడతాయి. వాటిలో ఉన్న శాస్త్రీయత, రాజకీయ విజ్ఞానం ఎంతో గొప్పది.

ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలోని అతిముఖ్యమైన ఎత్తుగడలు, కర్తవ్యాలు, కార్యక్రమం రూపొందిన క్రమాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతగానో సహాయ పడతాయి. వారిమైత్రి అపూర్వమైనది. ఆ ఉత్తరాలు విజ్ఞాన దీపికలు.

ఫ్రాన్స్‌లో మొదలై పశ్చిమ యూరప్ దేశాలకు వ్యాపించిన 1848 విప్లవాలు మార్క్స్, ఎంగెల్స్‌ను స్వదేశానికి వెళ్ళేలా చేసాయి. రైన్ రాష్ట్రంలో ఇరువురు మిత్రులు పోరాటాలకు గుండెకాయగా పనిచేసారు. మార్క్స్ దేశ బహిష్కరణకు గురికావడంతో ఎంగెల్స్ ఒక్కడే ప్రజా తిరుగుబాటులో పాల్గొన్నాడు. మూడు యుద్ధాల్లోను పోరాడాడు. తిరుగుబాటు ఓడిపోయిన తర్వాత స్విట్జర్లాండుకు తప్పుకొని, అటునుండి లండన్‌కు చేరాడు. ఎంగెల్స్ మాంచెస్టర్ వెళ్లి గతంలో పనిచేసిన వర్తకపు కంపెనీలోనే గుమాస్తాగా ప్రవేశించి తండ్రి మరణం తర్వాత 1864లో ఆ కంపెనీలో భాగస్తుడయ్యాడు. మార్క్స్ లండన్‌లో స్థిరపడగా, ఎంగెల్స్ మాంచెస్టర్‌లో ఉంటూ ఉత్తరాల ద్వారా అన్ని విషయాలు సమన్వయించుకున్నారు. 1870లో ఎంగెల్స్ కంపెనీలో వాటాను అమ్మివేసి తన నివాసాన్ని లండన్‌కు మార్చుకున్నాడు. ఈ కాలంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సంస్థను పది సంవత్సరాల పాటు చురుకుగా నడిపాడు.

అత్యంత శ్రమ, ఉత్సాహంతో కూడిన వారిద్దరి వైజ్ఞానిక జీవితం 1883 వరకు నిర్విరామంగా సాగింది. 1883 మార్చి 14న మార్క్స్ దీర్ఘ నిద్రలోకి వెళ్లిపోయాడు. మిత్రుని సమాధి దగ్గర ఎంగెల్స్ ఉపన్యాసం చారిత్రాత్మకమైనది. ప్రపంచంలోని గొప్ప ఆలోచన ఆగిపోయిందన్నాడు. మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ ఒక్కడే యూరప్‌లోని సోషలిస్టు ఉద్యమకారులకు మార్గదర్శకత్వాన్ని అందించాడు. వయోవృద్ధుడైన ఎంగెల్స్ విజ్ఞాన అనుభవాన్ని వారంతా స్వేచ్ఛగా వినియోగించు కున్నారు.

మార్క్స్ రచనల్లో 'దాస్ కాపిటల్'కున్న స్థానం గొప్పది. మార్క్స్ జీవితకాలంలో మొదటి భాగం మాత్రమే ప్రచురితమైంది. 2వ భాగం 1885లోను, మూడవభాగం 1894లోను ఏంగెల్స్ కృషి ఫలితంగా ప్రచురితమయ్యాయి. మార్క్స్ రాసిన పెట్టుబడి చిత్తుప్రతుల నుండి రెండు, మూడు భాగాలను తయారుచేయడం మాములు విషయం కాదు. ఆ రచనకున్న ప్రాధాన్యతను గుర్తించిన ఎంగెల్స్, మార్క్స్ ఆలోచనా ప్రవాహాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్నాడు కాబట్టి ఆ మహత్కార్యాన్ని భుజాలపైకెత్తుకొని విజయం సాధించాడు. పెట్టుబడి గ్రంథం ఇచ్చిన సామాజిక జ్ఞానం అమూల్యమైనది.

1889జూలై 14న పారిస్‌లో బాస్టిల్ పతనపు శతజయింతి మహాసభ జరిపిన సందర్భంగా రెండవ ఇంటర్నేషనల్‌ను ఏర్పరచి, దానికి నాయకత్వం వహించాడు.

మార్క్సిజానికి వ్యతిరేకంగా వచ్చిన అన్యవర్గ సిద్ధాంతాలను, రివిజనిస్టు పోకడలను ఎదుర్కొన్నాడు. సైద్ధాంతిక, రాజకీయ రంగాలలో మార్క్స్, ఎంగెల్స్ జరిపిన పోరాటాల ఫలితంగా యూరప్‌లో వర్గపోరాటం నిశితమైంది.

ఎంగెల్స్ ఇంగ్లాండు కార్మికరంగాన్ని అర్థం చేసుకున్న క్రమంలోనే కార్మికవర్గం చారిత్రక పాత్రను గుర్తించాడు. ఆర్థిక పునాది ప్రాధాన్యతను గుర్తించాడు. మార్క్స్ గుర్తించిన తత్వశాస్త్ర ప్రాధాన్యత, చారిత్రక దృష్టికి ఎంగెల్స్‌కు ఏర్పడిన అభిప్రాయాలు కూడా తోడై శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతానికి ఎంతో సహకరించింది.

ఎంగెల్స్‌ను వ్యక్తిగా మార్క్స్ నుండి విడిగాచూడలేం. ఆయన మేధస్సు మార్క్స్ మేధస్సును సంపూర్ణంగా అర్థం చేసుకొని అందులో లీనమయిపోయింది. ఆనాటి పరిస్థితుల నుండే ఆ ఇరువురి మైత్రిని, వారి అవిరళకృషిని అర్థం చేసుకోవాలి.

ఎంగెల్స్ వ్యక్తిగత జీవితం గురించి ప్రపంచానికి తెలిసినది తక్కువ. కుటుంబంలో తండ్రి నిరంకుశత్వ పరిస్థితుల కారణంగా తన ఆలోచనకు భిన్నమైన వృత్తి చేపట్టడం గురించి మనకు తెలుసు."బూర్జువాగా ఉండడం దుర్భర పరిస్థితి, బూర్జువాగా ఉండేవాడు కార్మికవర్గ వ్యతిరేకిగా ఉండితీరాలి. నా ఉద్యోగమే నేను చేసుకుంటున్నా ఇదంతా దుర్భరంగా ఉంది నాకు" అని మార్క్స్‌కు రాసిన లేఖలో ఎంగెల్స్ తన పరిస్థితిని వివరించాడు.

ఎంగెల్స్‌ను ప్రేమించి సహజీవనం చేసిన మేరిబర్న్ 1863లో అనారోగ్యంతో చనిపోయింది. ఆమె చెల్లెలు లిజ్జీబర్న్‌ను 1864లో వివాహం చేసుకున్నాడు. 1878లో లిజ్జీబర్న్ కూడా అనారోగ్యంతో చనిపోయింది, ఎంగెల్స్‌కు పిల్లలు లేరు. చివరిగా 1893లో జర్మన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా దేశాలను పర్యటించి అక్కడి ఉద్యమాలకు అవసరమైన సలహాలనందించాడు.

వృద్ధాప్య సమస్యలు, కనులు సరిగా కనబడక పోవడంతోపాటు 75వ ఏట గొంతు క్యేన్సర్ వ్యాధితో, కొన్ని నెలలుగా బాధకు గురయ్యాడు. 1895 ఆగస్టు 5న, ఫ్రెడరిక్ ఎంగెల్స్ లండన్‌లో తుదిశ్వాస విడిచాడు. శ్రామికవర్గ యోధుడు, శ్రామికవర్గ ప్రవక్త అయిన కామ్రేడ్ ఎంగెల్స్ చిరస్మరణీయుడు. శ్రామికవర్గ విముక్తిని బోధించిన ప్రపంచ కార్మికవర్గ మిత్రుడు.

మార్క్స్ నుండి విడదీయలేని స్థానాన్ని, చరిత్రలో అభివృద్ధికరంగా పోగుపడిన జ్ఞానానికి వారసుడుగా, నిలువెత్తు నిదర్శనంగా భావితరాల జ్ఞానంలో వెలుగొందే ఎంగెల్స్ మన కార్యచరణలో మార్గదర్శిగా నిలుస్తాడు.

# సోషలిస్టు విప్లవ నిర్మాత కామ్రేడ్ లెనిన్

**(జననం: 22 ఏప్రిల్, 1870 – మరణం: 21 జనవరి, 1924)**



కామ్రేడ్ లెనిన్ సామాజిక చలన నియమాల కనుగుణంగా సోషలిస్టు విప్లవ సిద్ధాంతాన్ని, సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజ నిర్మాణ పద్ధతులను రచించి నూతన చారిత్రక సామ్రాజ్యవాద దశలో శ్రామికవర్గ విప్లవాన్ని నడిపి, పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన చెందేందుకు కృషి చేశాడు. రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసి నూతన సమాజ పురోగమనానికి బాటలు వేశాడు. మార్క్స్, ఎంగెల్స్ రూపొందించిన కమ్యూనిస్టు సిద్ధాంతం ఆచరణసాధ్యం, అనుసరణీయం, శాస్త్రీయం అని నిరూపించాడు. కామ్రేడ్ లెనిన్ రష్యాలోని సింబీర్స్క నగరంలో రైతు కుటుంబంలో 1870, ఏప్రిల్ 22న జన్మించాడు. రష్యన్ విప్లవ నేతగా, సోషలిస్టు సమాజ నిర్మాతగా, ప్రపంచ కమ్యూనిస్టు నాయకుడుగా ప్రసిద్ధి చెందాడు. లెనిన్ ప్రామాణిక రచనల్లో 'ఏం చేయాలి?', 'సామ్రాజ్యవాదం–పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ', 'రాజ్యం–విప్లవం', 'శ్రామికవర్గ విప్లవం, స్వపక్ష పరిత్యాగి కాట్స్కీ', 'వామపక్ష కమ్యూనిజం–ఒక బాలారిష్టం', 'ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి', 'రష్యాలో విప్లవారంభం', 'ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ యొక్క రెండు ఎత్తుగడలు', 'మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు', 'జాతుల స్వయం నిర్ణయహక్కు', 'విప్లవంలో శ్రామికవర్గ కర్తవ్యాలు' ఇంకా అనేక ముఖ్యమైన అంశాలున్నాయి.

లెనిన్ ప్రతీఘాతుక శక్తుల నుండి, రివిజనిస్టుల నుండి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పరిరక్షించడమే కాకుండా స్థల కాలాల్లో వచ్చిన మార్పుల్ని గుర్తించి ఉత్పత్తి రంగంలో, విజ్ఞాన శాస్త్రాలలో సాధించిన ప్రగతికనుగుణంగా అభివృద్ధి చేశాడు. మార్క్సిస్టు అర్థశాస్త్రాన్ని అభివృద్ధి చేస్తూ సామ్రాజ్యవాదపు ఆర్థిక రాజకీయ అంతస్సారాన్ని విశ్లేషించాడు. పెట్టుబడిలోని మౌలిక సూత్రాల ప్రాతిపదికపై ఆధారపడి సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారీ విధానపు ఆఖరి దశగా విశ్లేషించాడు. దాని కుళ్లును, యుద్ధ పరిస్థితుల్ని, అనివార్యమైన పతనాన్ని, విప్లవాలకు అనుకూలతను విశదీకరించాడు. గుత్త సంస్థలు, ఫైనాన్స్ పెట్టుబడి, పెట్టుబడి ఎగుమతి, అంతర్జాతీయ గుత్త సంస్థలు, ప్రపంచ విభజన అని లెనిన్ చెప్పిన సామ్రాజ్యవాద లక్షణాలు ఈనాడు ప్రపంచ ప్రజలకు స్పష్టంగా కనబడుతున్నాయి. సామ్రాజ్యవాదం ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా, ప్రపంచ యుద్ధాలుగా

బయల్పడి అధిక ధరలు, ద్రవ్యోల్బణం, మాంద్యం, నిరుద్యోగం, అభద్రత, ఆకలి, దారిద్రం, వినాశనం, పరాయికరణ రూపాల్లో కోట్లాది ప్రజల ధన, మాన, ప్రాణాలతో చెలగాటమాడుతున్న వాస్తవం రోజూ మన అనుభవంలో ఉన్నదే.

పెట్టుబడిదారీ విధానానికి, సాధారణ విక్రయ వస్తు (సరుకు) ఉత్పత్తికి మౌలిక లక్షణం 'స్వేచ్ఛాయుత పోటీ'. దీనికి విరుద్ధమైనది గుత్తాధిపత్యం. ఇది పోటీ, ఘర్షణల కేంద్రీకరణకు, తీవ్రతకు కారణమవుతుంది. గుత్తాధిపత్యం పెట్టుబడిదారీ విధానంలో వున్నత దశనే. కానీ అది మరింత పరాన్నబుక్కు. అది మరణావస్థకు చేరువవుతున్న పరిస్థితి. అది యుద్ధాలకు, వినాశనానికి దారి తీస్తుంది. అయితే కార్మికవర్గం జాగరూకతతో వ్యవహరిస్తే అదే విప్లవాలకు తొలి సంధ్య అని కూడా లెనిన్ నిర్వచించాడు. మొదటి ప్రపంచ యుద్ధం, 1917 అక్టోబర్ రష్యన్ విప్లవ కాలంలో లెనిన్ చేసిన ఈ విశ్లేషణ ఆనాడు రష్యన్ విప్లవ ఆచరణలో విజయం సాధించింది. 1929 నాటి మహామాంద్యం పరిస్థితిని తలపింపజేస్తూ, మారుతున్న ప్రపంచ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు నేటికి కూడా ఆ విశ్లేషణ సరైనదేనని తేటతెల్లం చేస్తున్నాయి. మార్క్స్ 'పెట్టుబడి'తో పాటుగా లెనిన్ 'సామ్రాజ్యవాదం' కూడా అధ్యయనం చేయాలని నేటి పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

తాత్విక రంగంలో రివిజనిజంగా ముందుకు వచ్చిన 'విమర్శనాత్మక అనుభవవాదం'పై ఆయన చేసిన విమర్శ అత్యంత మౌలికమైనది. రక రకాలుగా తలెత్తుతున్న అనేక బూర్జువా తాత్విక ధోరణులకు సమాధానంగా కూడా ఉంటున్నది. ఆధునిక విజ్ఞానశాస్త్ర విజయాలు భౌతికశాస్త్రంలో నూతన ఆవిష్కరణలు తెచ్చాయి. అప్పుడు మాకిస్టులు 'పదార్థం అనే భావన అంతరించిందని', చేసిన విమర్శకు సమాధానంగా "పదార్థం నశించలేదని మరింత లోతుగా స్పష్టంగా వ్యక్తీకరించబడిందని" చెప్పాడు. పదార్థం ఒక మౌలిక తాత్విక భావన అని, వస్తుగత వాస్తవికత మన అనుభూతులకు స్వతంత్రమైన అస్తిత్వాన్ని కలిగి వుంటూనే వాటి ద్వారా కాపీ చేయబడి, ఫోటో తీయబడి ప్రతిఫలించబడుతుందని శాస్త్రీయంగా నిరూపించాడు. పదార్థానికి ప్రతిఫలించే గుణం ఉంటుందని, అత్యంత ఉన్నత రూపంలో మెదడులో జరిగే పదార్థ ప్రతిఫలనమే చైతన్యమని వివరించాడు. వైరుధ్యాలను అధ్యయనం చేసి విప్లవ గతితర్కాన్ని అభివృద్ధి చేశాడు. వైరుధ్యాలను 'గతితర్కపు సారం' అని గతితర్కాన్ని 'విరుద్ధాంశాల ఐక్యతా సిద్ధాంతం' అని, గతితర్కపు అంతస్సారాన్ని నిర్వచించాడు. అలాగే గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదాల మధ్యగల సజీవ సంబంధాన్ని వివరించాడు. భౌతికవాదం పదార్థం స్వతంత్రమైనదని ఎలా గుర్తిస్తుందో అలానే చారిత్రక భౌతికవాదం సామాజిక అస్తిత్వం కూడా మానవాళి సామాజిక చైతన్యానికి బయటనే ఉంటుందని గుర్తిస్తుంది. ఈ రెండు సందర్భాలలోను చైతన్యం వాటి ప్రతిఫలనంగానే ఉంటుంది. మానవునికి జ్ఞానం ప్రకృతి నుండి, ఆ సమాజపు ఆర్థిక పునాది నుండి వస్తాయని,

రాజకీయ సంస్థలు ఆర్థిక పునాదిపై నిలిచే సంస్థలు అని వివరించాడు. మన పార్టీ ప్రజారాజ్యాధికార నిర్మాణాలను ఏర్పరుస్తున్న ప్రస్తుత సందర్భంలో రాజ్యాంగ యంత్రం గురించి, శ్రామిక వర్గ నియంతృత్వం గురించి, సోవియట్ల నిర్మాణం గురించి శాస్త్రీయమైన అవగాహనను లెనిన్ అందించాడు.

రష్యాలోని సింబ్రిస్క్ నగరంలో వ్లదిమీర్ ఇల్విచ్ లెనిన్ 1870 ఏప్రిల్ 22న జన్మించాడు. అతని తండ్రి రైతు కుటుంబంలో పుట్టి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. అన్న అలెగ్జాండర్ నరోద్నాయ వోల్యా అనే టెర్రరిస్టు సంస్థలో పని చేశాడు. 1887లో అతనిని జారు ప్రభుత్వం ఉరి తీసింది. లెనిన్‌కు సెయింట్ పీటర్స్ బర్గ్, మాస్కో విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం నిరాకరించడంలో కజాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. అక్కడ మార్క్సిస్టు బృందంలో చేరి విప్లవకర విద్యార్థి ఉద్యమంలో పని చేశాడు. అక్కడ నుండి బహిష్కరించడం వలన సమారాకు వెళ్ళి స్వయంగా మార్క్సిస్టు బృందాన్ని ఆర్గనైజ్ చేశాడు. ప్రైవేటుగా చదివి సెయింట్ పీటర్స్ బర్గ్ యూనివర్సిటీ నుండి న్యాయశాస్త్ర పట్టభద్రుడయ్యాడు. ఆయన ఎప్పుడూ ఆ వృత్తిని చేయలేదు. సెయింట్ పీటర్స్ బర్గ్‌లో కేంద్రీకరించి 1895 నాటికి మార్క్సిస్టు కార్మిక బృందాలన్నింటనీ శ్రామిక విమోచనా పోరాట సమితి అనే ఒక సంస్థలో ఐక్యం చేశాడు. ఈ విధంగా లెనిన్ విప్లవకర, మార్క్సిస్టు కార్మిక వర్గ పార్టీని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేశాడు.

1895 నుండి 1905 విప్లవం వరకు 10 సంవత్సరాల కాలంలో లెనిన్ సిద్ధాంత రాజకీయ విషయాల్లో ఎంతో అభివృద్ధిని సాధించాడు. మొదట నరోడ్నిజంపై సిద్ధాంత పోరాటం నడిపి దానిని ప్రజల పట్ల విశ్వాసం లేనిదిగా నిరూపించాడు. కార్మిక వర్గ విప్లవకర మైత్రి జారు రాచరికాన్ని, భూస్వాములను, బూర్జువా వర్గాన్ని కూలదోయడానికి ప్రధాన సాధనం అని స్పష్టపరిచాడు. 1897 నుండి 3 సంవత్సరాల ప్రవాస శిక్షా కాలంలో లెనిన్ సైబీరియాలో ఉండి 'రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి' అనే గ్రంథం రాసాడు. అందులో రష్యాలో పెట్టుబడిదారీ విధానం ఒక యాధృచ్ఛిక ఘటన అన్న నరోడ్నిక్‌ల వాదనను ఖండించడంతో పాటు నరోడ్నిజాన్ని సైద్ధాంతికంగా ఓడించాడు.

1902లో ఆర్థికవాదుల సంకుచిత రాజకీయ అభిప్రాయాలపై, అవకాశవాద విధానాలపై విమర్శ చేస్తూ లెనిన్ 'ఏం చేయాలి?'లో పటిష్టమైన మార్క్సిస్టు సిద్ధాంత పునాదిపై విప్లవకారులకు ఆచరణలోనూ, సిద్ధాంతంలోనూ తర్ఫీదు ఇవ్వాలని కేంద్రీకృత, క్రమశిక్షణాయుత నిర్మాణం అవసరం అని నొక్కి చెప్పాడు. 1904లో ఆర్.ఎస్.డి.పి. ద్వితీయ మహాసభల్లో పార్టీ సభ్యత్వాన్ని ఆమోదించడానికి పార్టీ నిర్మాణంలో ఏదో ఒక యూనిట్‌లో చేరాలన్న నిబంధనను వ్యతిరేకిస్తూ పార్టీలో మైనారిటీ వర్గం చీలికను తెచ్చింది.

పార్టీలో లెనిన్ వాదనలకు మెజారిటీ రావడంతో అప్పటి నుండి లెనిన్ నాయకత్వంలోని పార్టీ బోల్షివిక్ పార్టీగా పిలువబడుతుంది. తరువాత కాలంలో మైనారిటీ (మెన్షివిక్కులు)

ఇస్క్రా పత్రిక సంపాదక వర్గంలో మెజారిటీ సంపాదించి "పార్టీ నిర్మాణం మరింత కఠినంగా ఉందని, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉండకుండా స్వేచ్ఛనివ్వాలని" అవకాశవాదంతో పార్టీ నిర్మాణ సూత్రాలపై దాడి చేసారు. "ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి"లో లెనిన్ క్రమశిక్షణాయుతమైన కేంద్రీకృత కార్మిక వర్గ పార్టీ ఆవశ్యకతను స్పష్టపరిచాడు.

1914లో స్విడ్జర్లాండులో ప్రవాస జీవితం గడుపుతున్న సమయంలో కామ్రేడ్ లెనిన్ భౌతికవాద తత్వశాస్త్రం, గతితర్కం, చారిత్రక భౌతికవాద దృక్పథం, వర్గపోరాటం, మార్క్స్ ఆర్థికసిద్ధాంతం, సోషలిజం, కార్మిక వర్గ పోరాట ఎత్తుగడలు అనే 7 మార్క్స్ బోధనాంశాలపై అవగాహన కల్పిస్తూ మార్క్సిస్టు సిద్ధాంతంలోని శాస్త్రీయ సోషలిజాన్ని సిద్ధాంత-ఆచరణల మధ్య ఐక్యతను వివరిస్తాడు. లెనిన్ మార్క్సిస్టు సూత్రాలపైననే ఆధారపడ్డాడు. నూతన చారిత్రక పరిస్థితులలో ఆ సూత్రాలను అభివృద్ధి చేసి:

1. సామ్రాజ్యవాదం, గుత్తపెట్టుబడిదారీ విధానం గురించి విశ్లేషణ; 2. కార్మిక వర్గ నియంతృత్వం; 3. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ నిర్మాణం; 4. కార్మిక వర్గ నాయకత్వ పాత్ర; 5. జాతుల వలసల సమస్య; 6. కార్మిక వర్గ పార్టీ అనే అంశాలను పరిపుష్టం చేశాడు. అందుకే లెనినిజం "సామ్రాజ్యవాదం, కార్మిక వర్గ విప్లవ యుగానికి చెందిన మార్క్సిజం"గా చెబుతున్నాం.

ఎ. రాజ్యం వర్గ పాలనకు సాధనం; బి. పెట్టుబడిదారీ రాజ్య యంత్రాన్ని ధ్వంసం చేయాలి. కార్మిక వర్గ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలి; సి. పార్లమెంటరీ తత్వంలేని నూతన తరహా ప్రజాస్వామ్యం, కార్మిక వర్గ ప్రజాస్వామ్యం నెలకొల్పాలి; డి. ''శక్తి మేరకు పని-పనిని బట్టి ప్రతిఫలం" అన్న సూత్రంతో సోషలిస్టు ఆర్థిక పునాది గల సమాజం ఏర్పడుతుంది. కమ్యూనిజానికి పరివర్తన చెందే సమయంలో అనేక వైరుధ్యాలు పరిష్కారమవుతాయి. ఆ క్రమంలోనే రాజ్యం క్రమంగా అంతరిస్తుంది అన్నాడు.

రష్యా అక్టోబరు సోషలిస్టు విప్లవం ప్రపంచ చరిత్రలో ఒక మూల మలుపు. సామ్రాజ్యవాద వ్యవస్థకు అది గండి కొట్టింది. ఉత్పత్తి సాధనాలు ప్రజలపరం అయ్యాయి. పాత రాజ్య వ్యవస్థ ధ్వంసం అయ్యింది. నూతన యుగానికి కార్మిక వర్గ విప్లవ యుగానికి నాంది పలికింది. పీడిత జాతులకు నిజమైన స్వేచ్ఛ, సమానత్వం లభించాయి. వలసల విముక్తికి, విప్లవాల యుగానికి నాంది పలికింది. సోషల్ డెమోక్రసీ అవకాశవాదాన్ని, సంస్కరణవాదాన్ని ఓడించి కార్మికవర్గ సిద్ధాంతమైన మార్క్సిజం విప్లవ విజయాన్ని సాధించింది.

"జాతుల స్వయం నిర్ణయాధికార హక్కు" అనే గ్రంథంలో లెనిన్

ఎ. జాతీయోద్యమం ఫ్యూడలిజంపై పెట్టుబడిదారీ వ్యవస్థ విజయంతో ముడిపడినది; బి. అన్ని రకాల జాతి పీడనలను కార్మిక వర్గం వ్యతిరేకించాలి. జాతుల స్వయం నిర్ణయాధికార హక్కులను బలపరచాలి. జాతుల సమస్యను నిర్దిష్ట పరిస్థితుల వెలుగులో

పరిష్కరించాలి; సి. బూర్జువా జాతీయ వాదాన్ని వ్యతిరేకించాలి; డి. కార్మిక వర్గానికి జాతీయపరమైన డిమాండ్లు వర్గపోరాట ప్రయోజనాలకు లోబడి ఉండాలి. అత్యంత బలమైన అంతర్జాతీయ ఐక్యతను స్థాపించడానికి తోడ్పడాలి.

సోవియట్ ప్రభుత్వం 'నిరంకుశ ప్రభుత్వం' అని రాసిన కాట్స్కీకి సమాధానంగా "కార్మిక వర్గ విప్లవం, ద్రోహి కాట్స్కీ" అనే గ్రంథాన్ని 1918లో లెనిన్ రాశాడు. అందులో కార్మిక వర్గ ప్రజాస్వామ్యం, బూర్జువా ప్రజాస్వామ్యాల మధ్య గల తేడాను వివరించి, వర్గాలున్నంత వరకు స్వచ్ఛమైన ప్రజాస్వామ్యం ఉండదని కార్మిక వర్గ పాలన అంటే అత్యధికుల పాలన అని, బూర్జువా వర్గాన్ని అణిచి ఉంచుతుందని వివరించాడు.

ఇంకా "విప్లవం ప్రజానీకం నుంచి, వ్యక్తుల నుండి ఏకాగ్రతను కోరుతుంది. నరనరం పని చేయాలని కోరుతుంది. లైంగిక విషయాల్లో విశృంఖలత్వం బూర్జువా లక్షణం. అది పతనానికి చిహ్నం. పెట్టుబడిదారీ విధానంలోని నైచ్యాన్ని, కల్మషాన్ని, క్రౌర్యాన్ని విప్లవం సహించలేదు" అంటాడు. ఈ విషయాలను క్లారా జట్కిన్ తాను రచించిన లెనిన్ స్మృతుల్లో పొందుపరిచింది.

తనతోపాటు సైబేరియాలో 3 సంవత్సరాలు శిక్షననుభవించిన నాడెజ్డా కృపస్కయాతో లెనిన్ పెండ్లి జరిగింది. ఇద్దరూ రాజకీయ కార్యక్రమాల్లో పరస్పరం సహకరించుకుంటూ అన్యోన్యంగా వివాహ జీవితం కొనసాగించారు.

1917 విప్లవానంతరం బోల్షివిక్కుల, ప్రజల రోజువారీ జీవితాలు ఎలా ఉన్నాయో పరిశీలించడం మీద లెనిన్ అత్యంత శ్రద్ధ పెట్టాడు. 1918 అగష్టు 30న లెనిన్ ఒక ఫ్యాక్టరీని సందర్శించి తరువాత గేటు బయట కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా ఒక దుండగుడు లెనిన్ మీద కాల్పులు జరిపాడు. ఆ గాయాల వలన తీవ్ర అనారోగ్యానికి గురైన లెనిన్ 1924వ సంవత్సరంలో జనవరి 21న తుది శ్వాస విడిచాడు.

సామ్రాజ్యవాదం తన సూపర్ లాభాలను కార్మిక వర్గంలో ఒక సెక్షన్‌కు లంచంగా ఇచ్చి లోబరుచుకుంటుంది. కార్మిక వర్గ ఉద్యమంలో అవకాశవాదానికి ఇదే పునాది అన్నాడు.

అవకాశవాదంతో పాటు పెటీ బూర్జువా అతివాదాన్ని కూడా ఓడించి బోల్షివిక్ పార్టీ రాటుదేలిందని వివరించాడు. 1920లో 'కమ్యూనిస్టు నీతిని' గురించి చెబుతూ కామ్రేడ్ లెనిన్ "ఖ్యాతి గాంచిన" "మంచినీళ్ళ గ్లాసు" సిద్ధాంతాన్ని మార్క్సిస్టు సిద్ధాంతంగా నేను పరిగణించను. పైగా ఇది సంఘ వ్యతిరేక సిద్ధాంతమని నా అభిప్రాయం" అంటాడు.

1905 బూర్జువా ప్రజాస్వామిక విప్లవం ఓడిపోయింది. దానిని విశ్లేషిస్తూ కామ్రేడ్ లెనిన్ "డ్రెస్ రిహార్సల్" అంటాడు. 1905 విప్లవ ఓటమి అనుభవ గుణపాఠాలు 1917 అక్టోబరు విప్లవానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. సార్వత్రిక తిరుగుబాటుకు అగ్రగామి వర్గం మీద, ప్రజా విప్లవ వెల్లువ మీద ఆధారపడాలన్నాడు. విప్లవ చరిత్ర పురోగామి వర్గాల అభివృద్ధిలో పురోగామి శ్రేణుల కార్యకలాపాలు అత్యున్నత స్థాయిలో ఉండాలన్నాడు.

# ఎర్ర రాజ్యాన్ని నిర్మించినవాడు ఫాసిజాన్ని ఓడించినవాడు కా. జె.వి స్టాలిన్

**(జననం: 21 డిసెంబర్, 1879 – మరణం: 1 మార్చి, 1953)**



స్టాలిన్ పేరు వినబడగానే రష్యా, అక్టోబర్ సోషలిస్టు విప్లవం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్‌ను తరిమికొట్టిన ఎర్రసైన్యం మన కండ్ల ముందు కదలాడుతాయి.

జోసెఫ్ విస్సారియోనోవిచ్ జుగాష్విలి (స్టాలిన్) జార్జియాలోని గోరిలో 1879 డిసెంబర్ 21న జన్మించాడు. 1953 మార్చి 1న తుదిశ్వాస విడిచాడు. 75 సంవత్సరాలు జీవించిన స్టాలిన్ విప్లవ జీవితం సుమారుగా 60 సంవత్సరాలు కొనసాగింది. లెనిన్‌కు రష్యాలో బోల్షివిక్ పార్టీ నిర్మాణంలో అనుచరుడుగా, సోషలిస్టు రాజ్య స్థాపనలో సహచరుడుగా ఎదిగిన స్టాలిన్ చెప్పులు కుట్టే పునాది వర్గాలలో పుట్టి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడయ్యాడు.

1898లో రైల్వే వర్క్‌షాపులో కార్మికుల స్టడీ సర్కిల్‌కు బాధ్యుడుగా వున్నాడు. ఆ కామ్రేడ్స్ మధ్యనే స్టాలిన్ విప్లవ దీక్షను స్వీకరించాడు. "టిప్లిన్ లోని కార్మికులే నా తొలి ఉపాధ్యాయులు" అన్నాడు. స్టాలిన్ ఉత్తమ విద్యార్థి కూడా.

యవ్వనకాలంలో ట్రాన్స్‌కకాషియా పార్టీకి నాయకుడుగా ఉన్న కాలంలోనే కార్మిక సంఘాల కార్యకలాపాలను విచ్ఛిన్నం చేస్తున్న అరాచకవాదుల మధ్య భావాలను విమర్శిస్తూ మార్క్సిస్టు మౌలిక భావాలను సరళంగా చెప్పాడు. ఇదే "అరాచకవాదమా? సోషలిజమా" అనే ప్రసిద్ధ రచన వ్యక్తి కేంద్రంగా అరాచకవాదం ఉంటుందని; మార్క్సిజానికి మూలం ప్రజలని, ప్రజా విముక్తిలోనే వ్యక్తి విముక్తి వుందని, అంతా ప్రజలకే చెందుతుందని మార్క్సిజం చెబుతుందని వివరిస్తాడు. ఆ మాటలకు కట్టుబడే తన కార్యాచరణను తుదివరకు కొనసాగిస్తాడు.

1807–09 సంవత్సరాల మధ్య మూడేళ్లపాటు బకూలో చమురు పరిశ్రమ కార్మికుల్లో విప్లవ కృషి చేసాడు. "బకూలో వాత్సేక్, శరతోవెట్స్, ఫలిలోవ్‌లు చైతన్యవంతమైన కార్మికులు. వారితో నాకు ఏర్పడిన అనుబంధం కార్మికోద్యమ పాఠాలు నేర్చుకోవడానికి విప్లవోద్యమ 2వ దశలోకి ఎదగడానికి ఎంతో తోడ్పడ్డాయని"

స్టాలిన్ చెప్పుకున్నాడు. స్టాలిన్ విప్లవ జీవిత క్రమాన్ని చూస్తే ఇలా ఉంటుంది.

స్టాలిన్ దృఢంగా, గట్టిగా ఉండేవాడు. 6,7 సంవత్సరాల వయస్సులో ఆటలమ్మ (స్మాల్‌ఫాక్స్) వచ్చింది. స్టాలిన్ ముఖంపై ఆ మచ్చలుంటాయి. రక్తం ప్రభావితం కావడంతో చావు దరి దాపుల్లోకి వెళ్ళి బతికాడు. స్టాలిన్ ఎడమ చెయ్యి శాశ్వతంగానే అవిటిదయ్యింది. గోరి స్కూల్‌లోని 5 సంవత్సరాల కాలంలో స్టాలిన్ తెలివి తేటలతో, ప్రారంభమైన జ్ఞాపకశక్తితో గుర్తింపు పొందాడు. అదే సమయంలో హేతుబద్ధంగా ఆలోచించి మతాన్ని వ్యతిరేకించాడు. జార్జియన్ సాహిత్యం, కవిత్వంలోని జాతీయ భావాలతో ప్రేరేపించబడి కవిత్వం రాయడం ప్రారంభించాడు. ఆనాడు జార్జియా అణచివేయబడిన జాతి, ఇప్పుడది ఒక దేశం.

నిరంకుశ జారు పాలన మీద ఉన్న వ్యతిరేకతతో 15 సంవత్సరాల వయస్సులో రహస్య మార్క్సిస్టు బృందాలతో కలిశాడు. 20వ ఏటనే వృత్తి విప్లవకారుడుగా మారాడు. 23వ ఏట అరెస్టుతో ప్రారంభమై అనేకసార్లు అరెస్టు కావడం, ప్రవాసం పంపబడడం, తప్పించుకుని రావడం ఎన్నో మార్లు జరుగుతూ తిరిగి ఆర్.ఎస్.డి.ఎల్.పి. కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. 1905లో జరిగిన బోల్షివిక్ కాంగ్రెస్‌కు ప్రతినిధిగా వచ్చి మొదటిసారి లెనిన్‌ను కలిశాడు. 1908, 10, 12 లలో అరెస్టయి సైబీరియాకు పంపబడ్డాడు. ప్రవాసంలో లేని కాలంలో ప్రావ్దా పత్రికకు సంపాదకుడుగా పనిచేశాడు. 1913 లో అరెస్టు సందర్భంగా సైబీరియాలోని అత్యంత మారుమూల ప్రాంతానికి పంపివేయడంతో 1917 ఫిబ్రవరి విప్లవం వరకు రాలేక పోయాడు.

1912 జనవరిలో జరిగిన బోల్షివిక్ పార్టీ కాంగ్రెస్‌లో ఎన్నికైన కేంద్రకమిటీ మొదటి సమావేశంలో స్టాలిన్‌ను కో ఆప్ట్ చేసుకుని మొదటి బోల్షివిక్ దినపత్రిక 'ప్రావ్దా'ను తీసుకవచ్చే కర్తవ్యాన్ని ఇచ్చారు.

1922లో స్టాలిన్ బోల్షివిక్ పార్టీకి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. స్టాలిన్ జారిస్టు రష్యాలో రహస్య నిర్మాణంలో పనిచేసి, ప్రజల ప్రాణ సంబంధమైన పార్టీ నిర్మాణాన్ని అభివృద్ధి చేసి ఉన్నత స్థానానికి ఎదిగాడు.

స్టాలిన్ మృదువుగా, సూటిగా, సుళువుగా మాట్లాడే మితభాషి. స్వచ్ఛమైన రష్యన్ భాష జార్జియన్ యాసతో ఉండేది. తన ప్రసంగాల్లో అలంకారాలు, సామెతలు ఎక్కువ. స్టాలిన్ హాస్య ప్రియుడు. నిశ్శబ్దంగా తనలో తను నవ్వుకునే విధంగా ఉండేవాడు. కష్టపడి పనిచేయడం, జ్ఞాపకశక్తి, నిబ్బరం, నమ్రత, ఆత్మవిశ్వాసం లాంటి మంచి సుగుణాలతో పాటు, కోప స్వభావం కూడా ఉండేది. ఎక్కువగా వినడం, తక్కువగా మాట్లాడడం, సమిష్టి ఆలోచనను ప్రతిబింబించడం, మెజారిటీ అభిప్రాయాన్ని

అర్థం చేసుకుని పార్టీ విధానాన్ని రూపొందించడం ద్వారా కార్యసాధకుడుగా, ప్రతిభాశాలిగా రూపొందాడు. గొప్ప పాలకుడుగా ప్రజల మనిషిగా నిలిచిపోయాడు.

కా. లెనిన్ సిద్ధాంత పునాదులపై ఆధారపడే స్టాలిన్ ప్రపంచంలో మొదటి సోషలిస్టు సమాజాన్ని నిర్మించేందుకు నాయకత్వ పాత్రను పోషించాడు. సృజనాత్మకంగా అన్వయించి లెనినిజాన్ని పరిరక్షించి, అభివృద్ధి పరిచాడు. లెనిన్ మారణానంతరం 3 దశాబ్దాల పాటు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించాడు. ట్రాట్స్కీ, జినోవివ్, బుకారిన్ సిద్ధాంతాలను, ఇతర బూర్జువా అవకాశవాద సిద్ధాంతాలను ఓడించి మార్క్సిజాన్ని పరిరక్షించాడు.

"ప్రత్యేకించి లెనినిజం అంటే కార్మిక వర్గపు నియంతృత్వం ఎత్తుగడలు" అని బలంగా నమ్మిన స్టాలిన్ వాటిని దృఢచిత్తంతో అమలు చేసాడు. కార్మిక, కర్షక రాజ్యాన్ని చుట్టుముట్టిన అంతర్గత పోరాటాలు, సామ్రాజ్యవాద దేశాల కుట్రలు, ఫాసిస్టుల దాడులను కార్మికవర్గ దృక్పథంతో సరైన వ్యూహం – ఎత్తుగడలతో ఓడించిన స్టాలిన్ నాయకత్వం సోవియట్ యూనియన్ అజేయమని చాటింది.

జాతుల సమస్యపై స్టాలిన్ అవగాహనను మెచ్చుకున్న లెనిన్ గోర్కికి ఉత్తరం రాస్తూ స్టాలిన్‌ను "వండర్‌ఫుల్ జార్జియన్" దొరికాడని వర్ణించాడు. జాతుల సమస్య పరిష్కారానికి విశాల హృదయుడు, అచంచల విశ్వాసం, ఆచరణలో నిర్మాణ శక్తి సామర్థ్యాలు గల స్టాలిన్ జాతుల కమీసారియేట్ చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. స్టాలిన్ రాసిన "మార్క్సిజం, జాతుల సమస్య" అనే వ్యాసం 1913లో ప్రచురించారు. స్టాలిన్ జాతి గురించి నిర్వచించిన విషయం ఒక ప్రామాణిక విషయంగా నిలిచిపోయింది.

"ఒక జాతి అనేది చారిత్రాకంగా రూపుదిద్దుకున్న భాష, ప్రదేశం, ఆర్థిక జీవనం, సమైక్య సంస్కృతిగా అవతరించిన మానసిక ప్రవృత్తి కల్గిన ఒకే పటిష్టమైన సమాజం... ఈ లక్షణాలన్ని కనిపించినప్పుడే మనం దానిని జాతి అని అంటాం"

1929లో ప్రచురించిన 'జాతుల సమస్య – లెనినిజం' అనే స్టాలిన్ గ్రంథంలో అనేక సందేహాలకు సమాధానం చెప్పడంతో పాటు తన అవగాహనలో కూడా అభివృద్ధిని కనబరుస్తూ సామ్రాజ్యవాద యుగంలో జాతుల సమస్య పరిష్కారాన్ని వివరిస్తాడు.

జాతుల సమస్య, వలసల సమస్యల పరిష్కారం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంతోను, ప్రపంచ సోషలిస్టు విప్లవంతోను ముడిపడి ఉన్నదని తెలియజేశాడు.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) 14, 15, 16, 17 మహాసభలకు స్టాలిన్ రూపొందించిన నివేదికలు ఎంతో సమగ్రమైనవి. బోల్షివిక్ పార్టీ చరిత్రలో

9, 10, 11, 12 అధ్యయాలను పరిశీలించిన సోషలిస్టు సమాజ నిర్మాణ కృషి అర్థమవుతుంది. పార్టీ చరిత్ర, నివేదికలు ప్రామాణికమైనవిగా నిలిచిపోయాయి.

రైతాంగంతో పొత్తు, మితవాదంతో ఘర్షణ, సోషలిస్టు శ్రమ, సోవియట్ రాజ్యాంగం లాంటి ఎన్నో అంశాలు అక్కడ పరిష్కారం అయ్యి అనుభవ పాఠాలుగా మారాయి.

1917 అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయవంతం అయిన వెంటనే 14 సామ్రాజ్యవాద దేశాలు రష్యాను ప్రత్యక్షంగా, పరోక్షంగా నాశనం చేయడానికి పూనుకున్నాయి. వారి కలలు కల్లలు చేస్తూ సోషలిస్టు రాజ్యం పురోగమించింది. 1940 ప్రాంతాలలో జర్మనీని రెచ్చగొట్టడం (హిట్లర్) ద్వారా మరో ప్రయత్నం చేసాయి. స్టాలిన్ బ్రహ్మాండమైన ఎత్తుగడలు, జాగ్రత్తలు సోవియట్ ప్రజల్ని దేశరక్షణకు ఒక్క మనిషిలా నిలిపాయి. సోవియట్ ప్రజల చైతన్యాన్ని, ఎర్రసైన్యపు వీరోచిత ప్రతిఘటనను ప్రపంచానికి చాటి చెప్పాయి. ఒక దేశంలోని సోషలిస్టు స్థావర ప్రాంతం ప్రపంచంలో అనేక దేశాలకు విస్తరించి మూడో వంతు ప్రపంచమే సోషలిస్టు క్యాంపుగా మారింది. ఫాసిజం ఓడిపోయింది. సామ్రాజ్యవాదం బలహీనపడింది. ప్రపంచ వ్యాపితంగా జాతుల పోరాటాలు, జాతీయోద్యమాలు, విప్లవ పోరాటాలు విస్తరించి విజయాలు సాధించాయి. స్టాలిన్ సారథ్యంలో సోవియట్ రష్యా ఒక బలమైన విప్లవ స్థావరంగా చైనా విప్లవానికి, ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఎంతో దోహదం చేసింది. మూడవ ఇంటర్నేషనల్ ఏర్పడి బలపడడానికి, పశ్చిమ దేశాల్లో కార్మిక వర్గానికి; ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాల ప్రజలు విప్లవించడానికి సైద్ధాంతిక రాజకీయ మద్దతు నివ్వడంతోపాటు భౌతికంగా ఎంతో సహకారాన్ని అందించింది. స్టాలిన్ అంతర్జాతీయ దృక్పథం ఎంత గొప్పదో అర్థమవుతుంది. అలాగే బలమైన, బోల్షివిక్ స్పిరిట్, ఉక్కు క్రమశిక్షణగల కార్మికవర్గ నియంతృత్వ పార్టీ అవసరాన్ని గురించి స్టాలిన్ చెప్పిన విషయం మనకు ప్రామాణికం.

"ఒక సరైన రాజకీయ పంథా రూపొందించబడిన తర్వాత, ఆచరణలో పరీక్షించబడిన తర్వాత పార్టీ నెరిపే నాయకత్వంలో పార్టీ కేడర్లు నిర్ణయాత్మక శక్తి అవుతారు. రాజకీయ పంథాను ఆచరణలో పెట్టాలంటే మన కాడర్లు, పార్టీ రాజకీయ పంథాను అర్థం చేసుకున్న వాళ్ళు, ఆ పంథాను తమదిగా స్వీకరించిన వాళ్ళు, దానిని ఆచరణలో పెట్టడానికి సిద్ధమైనవాళ్ళు, దానిని నిజంగా మార్చగలిగిన వాళ్ళు, దానిని ఆచరణలో పెట్టి జవాబుదారీ వహించే వాళ్ళూ, దానిని పరిరక్షించి దానికోసం పోరాడేవాళ్ళూ, మనకు ఉండి తీరాలి. దీనిలో విఫలమైతే ఒక సరైన రాజకీయపంథా శుద్ధ నామమాత్రమైనదిగా అయిపోయే ప్రమాదం ఉంది".

స్టాలిన్ ఆచరణ క్రమంలో ఎదురైన సమస్యలను పరిష్కరించడంలో భాగంగా మార్క్సిస్టు అవగాహనతో భాష సమస్యను లోతుగా అధ్యయనం చేసి సోవియట్ ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా భాషాశాస్త్రం – భాష ఆవిర్భావం, స్వభావం, అభివృద్ధి సూత్రాల గురించి వ్యాసాలు రాశాడు. "భాషా శాస్త్రంలో మార్క్సిజం గురించి" రాశాడు.

రష్యాలో లెనిన్ మరణానంతరం సభ్యత్వ క్యాంపెయిన్ చేపట్టి 2,80,000 మందిని చేర్చుకున్నాడు. వారికి విద్యాబోధన చేశాడు స్టాలిన్. లెనిన్‌కు శిష్యుడిగా లెనిన్ సిద్ధాంతాన్ని సరళభాషలో అర్థం చేయించడానికి విశేషకృషి చేశాడు. లెనినిజం పునాదులు ఒక ప్రసిద్ధ గ్రంథంగా చెప్పవచ్చు. పార్టీ నిర్మాణం, పని విధానం, శైలి ఇలా ఎన్నో విషయాల్ని ముఖ్యంగా కార్మికవర్గ నియంతృత్వ అవసరాన్ని బలంగా చెప్పడంలో లెనిన్ అవగాహన శక్తిని భవిష్యత్ తరాలకు అందించాడు. నిజమైన శిష్యుడుగా, మనకు మార్గదర్శకుడుగా నిలిచిపోయాడు. ఇవన్నీ స్టాలిన్ చేసిన ఉపన్యాసాలే. 1924లో ఇది ప్రచురించబడింది.

స్టాలిన్ రచనలు అనేకం ఉన్నాయి. అన్నింటిలోను మార్క్సిజం, లెనినిజం లను వివరించడానికి, అన్వయించడానికి, సోవియట్ యూనియన్‌ను తీర్చి దిద్దడానికి చేసిన కృషిగా అవి మనకు జ్ఞానాన్ని అందిస్తాయి. లెనినిజం అంటే సామ్రాజ్యవాద దశకు చెందిన మార్క్సిజం అని స్టాలిన్ వివరించాడు. లెనినిజం రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదంతో పోరాడడం ద్వారానే బలపడింది. ఈ పోరాటం జరగకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడడం అసాధ్యం అయ్యేది అంటాడు స్టాలిన్.

1929–33 ల నాటి మహా మాంద్యంతో సామ్రాజ్యవాదం ఫాసిజం వైపుకు ప్రయాణించింది. ప్రతీఘాతుకత పెరిగింది. సోషల్ డెమోక్రటిక్ వామపక్షం వెనుకంజ వేసింది. ఇదే 2వ ప్రపంచ యుద్ధానికి దారి తీసింది. ఇది ఫైనాన్స్ పెట్టుబడి నగ్న బీభత్స నియంతృత్వం. విప్లవాన్ని నిరోధించడం దాని లక్ష్యం. 3వ ఇంటర్నేషనల్ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలని నిర్ణయించింది.

డిమిట్రావ్, స్టాలిన్‌ల నాయకత్వం ఫాసిస్టు వ్యతిరేక ఐక్యసంఘటనకు పిలుపునిచ్చింది. కానీ సోషల్ డెమోక్రటిక్ పార్టీలు దీనికి భిన్నంగా వ్యవహరించాయి. స్టాలిన్ నాయకత్వంలో రష్యా దీనికి కట్టుబడి విజయం సాధించింది. ప్రపంచంలో సరైన మార్క్సిస్టు – లెనినిస్టుగా నిలబడింది. చైనాకూడా సరైన విధానాన్ని చేపట్టింది.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం రష్యా విప్లవం నుండి చైనా విప్లవం వరకు (1917 – 1949) నడిచిన కాలంలో, ఈ దశ తర్వాత కూడా కామ్రేడ్ స్టాలిన్ నిర్వహించిన

పాత్ర గొప్పది. ఒక దేశంలో సోషలిజం నిర్మించడం సాధ్యం కాదనే ట్రాట్స్కీ తప్పుడు సిద్ధాంతాన్ని ఆచరణలో సోవియట్ యూనియన్‌లో సోషలిజాన్ని నిర్మించడం ద్వారా ఓడించింది కమ్యూనిస్టు పార్టీ. సమిష్టి క్షేత్రాల పథకం ద్వారా వ్యవసాయంలో సోషలిజం ఎలా ప్రవేశ పెట్టవచ్చో నిరూపించింది.

అలాగే హిట్లర్ దురాక్రమణను ఓడించడానికి సోవియట్ యూనియన్ అజేయమయిన మిలటరీ శక్తిగా రూపొందింది. ఇంకా సామ్రాజ్యవాదుల కుట్రలను భగ్నం చేసి, వారి ఐక్యతను విచ్ఛిన్నం చేసిన ఎత్తుగడలు రూపొందించింది. హిట్లర్‌ను ఓడించి తరిమికొట్టి తూర్పు యూరప్‌ను విముక్తి చేసింది. ప్రపంచ కార్మికోద్యమం, వివిధ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు బ్రహ్మాండంగా అభివృద్ధి అయ్యాయి. చైనా, కొరియా, వియత్నాం విప్లవాలు విజయం పొందాయి. అలాగే ట్రాట్స్కీ, టిటోలతో సహా అవకాశవాదుల సిద్ధాంతాలను ఓడించింది. ఇవన్నీ స్టాలిన్ నాయకత్వంలో పార్టీ ప్రజలు సాధించిన విజయాలు.

1933 – 36 మధ్య కాలంలో పార్టీలో శుద్ధి కార్యక్రమం జరిగింది. ఇందులో కొన్ని తప్పులు కూడా జరిగాయి. స్టాలిన్‌పై నియంత, బంధుప్రీతి లాంటి అనేక రకాల ఆరోపణలున్నాయి. ఇవన్నీ పచ్చి అబద్ధాలని కామ్రేడ్ స్టాలిన్ మహోన్నత చరిత్రను పరిశీలిస్తే అర్థమవుతుంది. స్టాలిన్ కుమారుడు యాకొవ్ ఓ సాధారణ ఎర్ర సైనికుడిగా యుద్ధంలో నాజీ సేనలకు చిక్కాడు. నాజీలు తీవ్ర చిత్రహింసలు పెట్టారు. స్టాలిన్‌కీ, కమ్యూనిజానికీ వ్యతిరేకంగా ఓ ప్రకటన ఇప్పించడానికి, యాకొవ్‌ని అప్రూవర్‌గా మార్చుకునేందుకు నాజీల శైలిలో చిత్రహింసలు పెట్టారు. అయినా లొంగలేదు. అదే కాలంలో పౌలస్ అనే ఓ ముఖ్య నాజీ సేనాని ఎర్ర సైన్యానికి చిక్కాడు. తమ సేనాని పౌలస్‌ని విడచిపెడితే, అందుకు బదులుగా యాకావ్‌ను విడుదల చేస్తామని హిట్లర్ ప్రభుత్వం స్విట్జర్లాండు రాయబారి ద్వారా కబురు పంపింది. సహచర ప్రభుత్వాధినేతలు చాలా మంది యాకొవ్‌ను విడిపించుదామని కోరారు. కానీ స్టాలిన్ అంగీకరించలేదు. తన కొడుకు వంటి యువకులు దేశం కోసం లక్షల మంది బలయ్యారని, అందులో యాకొవ్ ఒకడనీ అన్నారు. నాజీ మిలిటరీ వ్యూహ రచయితను విడుదల చేయడం దేశానికి ప్రమాదకరమన్నాడు. తన కొడుకు క్షేమం ఓ నాజీ మెదడును వదిలివేస్తే, మరికొన్ని లక్షల మంది మరణాలకి అది కారణమవుతుందంటూ తిరస్కరించాడు. ఫలితంగా యాకొవ్ నాజీల చేతుల్లో హత్యకు గురయ్యాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మాస్కోలో జరిగిన విజయోత్సవసభలో వందన స్వీకారం అందుకునే నిజమైన అర్హత స్టాలిన్‌కే ఉంది. కానీ ఝుకోవ్ ఆ

గౌరవాన్ని స్వీకరించేలా చేశాడు స్టాలిన్. గొప్ప మార్క్సిస్టు – లెనినిస్టు అయిన కామ్రేడ్ స్టాలిన్‌పై పలు నిందలతో కూడిన దాడిని ఖండిస్తూ కామ్రేడ్ మావో 'చరిత్రలో స్టాలిన్ స్థానం' అనే వ్యాసంలో ఈ కింది అంచనా యిచ్చాడు.

"లెనిన్ మరణించిన తర్వాత పార్టీ, ప్రభుత్వాల ప్రధాన నాయకుడిగా ఉండిన స్టాలిన్ మార్క్సిజం– లెనినిజాన్ని సృజనాత్మకంగా అన్వయిస్తూ, దాన్ని అభివృద్ధి చేశారు. లెనినిజం వారసత్వాన్ని దాన్ని శత్రువుల బారి నుండి ట్రాట్‌స్కీ వాదులు, జినోవైవ్‌వాదులు, తదితర బూర్జువా ఏజెంట్లు సంరక్షించే పోరాటంలో స్టాలిన్ ప్రజల అభీష్టానికీ, కోరికలకూ అద్దం పట్టాడు. తానో మార్క్సిస్టు – లెనినిస్టు మహాయోధుడనని నిరూపించుకున్నారు. స్టాలిన్ సోవియట్ ప్రజల మద్దతును చూరగొన్నారు. చరిత్రలో ఒక ప్రముఖ పాత్రను పోషించారు. అందుకు ప్రధాన కారణం ఏదంటే, ఆయన సోవియట్ కమ్యూనిస్టు పార్టీలో ఇతర నాయకులతో కలిసి సోవియట్ యూనియల్‌లో సోషలిజానికి అఖండ విజయాన్ని సాధించి పెట్టారు. హిట్లర్ వ్యతిరేక యుద్ధంలో సోవియట్ యూనియన్ విజయానికి పరిస్థితులను సృష్టించారు. సోవియట్ ప్రజల ఈ విజయాలు, ప్రపంచ కార్మికవర్గ ప్రయోజనాలకూ, సమస్త ప్రగతిశీల మానవాళి ప్రయోజనాలకూ అనుగుణ్యంగా ఉన్నవే. అందుచేతనే స్టాలిన్ పేరు, సర్వసహజంగానే ప్రపంచమెల్లెడలా కీర్తించబడుతోంది. అయితే, లెనినిస్టు పంథాను సరిగ్గా అన్వయించడం ద్వారా దేశంలోపలా, వెలుపలా ఉన్న ప్రజలలో ఇంతటి గొప్ప గౌరవాన్ని సంపాదించుకున్నాడు స్టాలిన్.

స్టాలిన్ అన్నీ తప్పులే చేశాడని కొందరు భావిస్తారు. ఇది చాలా ఘోరమైన అపోహ. స్టాలిన్ ఒక గొప్ప మార్క్సిస్టు – లెనినిస్టు. మనం స్టాలిన్‌ను ఒక చారిత్రక దృష్టి కోణం నుండి చూడాలి. ఆయన ఎక్కడ సరిగా ఉండినారు, ఎక్కడ పొరబడ్డారో గమనించడానికిగాను, సముచితమైన, సమగ్రమైన విశ్లేషణ జరపాలి; దాని నుండి ప్రయోజనదాయకాలైన గుణపాఠాలను రాబట్టాలి. ఆయన తప్పులు, ఒప్పులు, రెండు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ పర్యవసానాలే. వాటిపై ఆ కాలపు ముద్ర ఉంది. మొత్తంగా చూసినపుడు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఓ దురాక్రమణకు గురికాకుండా దేశ సరిహద్దులను కాపాడడం, ప్రకృతి వైపరీత్యాలప్పుడు ప్రజలకు సేవ చేయడం. ఈ లక్ష్యానికి అనుగుణ్యంగానే తర్ఫీదు, ఆయుధాలలో మార్పు ఉంటుంది. తమ దేశ సరిహద్దులను కాపాడడం కోసం శత్రువుతో తలపడే విధంగా సైన్యానికి దేశభక్తితో కూడిన మోటివేషన్ ఉండాలి.

కాని, గత ఆరు దశాబ్దాల భారతసేన ఆచరణ దీనికి భిన్నంగా ఉండటాన్ని

మనం గమనించవచ్చు. భారత పాలకవర్గాలు తాము రాసుకున్న రాజ్యాంగానికి తామే తిలోదకాలు ఇచ్చి, అందులో అప్రధానంగా రాసుకున్న 'అంతర్గత భద్రత కోసం అవసరమైతే భారత ప్రభుత్వం సాయుధ బలగాలను వినియోగించవచ్చు' అనే అంశాన్ని ఉపయోగించుకొని అవి అనేకసార్లు ప్రజలపై భారత సైన్యాన్ని, సాయుధ బలగాలను దింపాయి. 1947 ఆగస్టు 15 బూటకపు స్వాతంత్ర్యం నుంచి 2011 వరకూ చూసినట్లయితే భారత సైన్యం దేశ సరిహద్దుల్లో యుద్ధంలో పాల్గొన్నది 143 రోజులే. అంతర్గత భద్రత అనే ముద్దుపేరుతో అది దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం మొట్టమొదట 'నైజాం నుంచి విముక్తి' సాకుతో తెలంగాణ ప్రజలపై యుద్ధం చేసింది (1948 సెప్టెంబర్ నుంచి 1951 అక్టోబర్ వరకు). ఆ తర్వాత ఈశాన్య రాష్ట్రాలను, కాశ్మీరును దురాక్రమణ చేసింది. 1971 జూలైలో బీర్‌భూం విప్లవ ప్రజల పోరాటంపై అణచివేత దాడి సాగించింది. అలాగే 1990లో పంజాబు ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా 'శిక్షణ' సాకుతో భారత సైన్యాన్ని సంపూర్ణంగా ఉపయోగించారు. ఇప్పుడు మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో దండకారణ్యంలో శిక్షణ పేరుతో 2011 మే చివరిలో భారత సైన్యాన్ని ఒక బ్రిగేడ్ స్థాయిలో దించారు. ఇప్పటికి రెండు బ్యాచీలకు శిక్షణ పూర్తయ్యింది.

భారతదేశంలో అనేక దశాబ్దాలుగా సాగుతున్న జాతుల విముక్తి పోరాటాల మీద, విప్లవోద్యమం మీద సైన్యం, పారామిలటరీ, స్పెషల్ పోలీసు బలగాలు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ (ఎల్‌ఐసి) వ్యూహాన్ని అమలు జరుపుతూ వస్తున్నాయి. ఈ క్రూరమైన అణచివేత క్యాంపెయిన్లలో ఈశాన్యంలో 30,000, కాశ్మీరులో 80,000, పంజాబ్‌లో 10,000 తెలంగాణ సాయుధ పోరాటంలో (1946-51) 5,000, బీర్‌భూమ్‌లో 200 మంది ప్రజలను, కార్యకర్తలను; ఇంకా పారామిలటరీ, పోలీసు, స్పెషల్ కమాండో బలగాలు నక్సల్బరీ, శ్రీకాకుళం నుంచి ఇప్పటి వరకూ సాగించిన హత్యాకాండలో మావోయిస్టు ఉద్యమంలో అసువులు బాసిన 13,000 మందితో కలుపుకుంటే లక్షల మంది స్త్రీ, పురుషులను భద్రతా బలగాలు ఊచకోత కోశాయి. లక్షలాది మందిని చిత్రహింసలకు గురిచేసి జైళ్లలో బంధించాయి. కోట్లాది రూపాయల ప్రజల ఆస్తులను కొల్లగొట్టారు, తగులబెట్టారు. వేలాది మంది యువతీ యువకులను మాయం చేశాయి. ఈ దురాగతాలన్నీ ఏమి తెలియజేస్తున్నాయి? సామ్రాజ్యవాదుల అధిక లాభాల కోసం, దేశాన్ని అమ్మటమే వృత్తిగా గల ఈ దోపిడీ పాలకవర్గాల (దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల) ప్రయోజనాల కోసం సైన్యం, పారామిలటరీ, పోలీసు బలగాలు ప్రజలను ఊచకోత కోసేందుకు ఏమాత్రం

సంకోచించవు అనేది వీటి ద్వారా రుజువు కావడం లేదా? సామ్రాజ్యవాదుల కావలి కుక్కలమని వారు తమకు తామే రుజువు చేసుకోవడం లేదా? దోపిడీ ప్రభుత్వపు క్రూరమైన, హింసాత్మక, వందేళ్ళ పై చిలుకు వయస్సు మాత్రమూ ఉంది. అక్టోబరు విప్లవం విజయం సాధించింది కేవలం 39 ఏళ్ళ క్రితమే. విప్లవకృషికి సంబంధించిన పలు రంగాలలోని అనుభవం ఇప్పటికీ అంతంత మాత్రపుదే. గొప్ప విజయాలు సాధించబడ్డాయి. అయినప్పటికీ లోపాలు, తప్పులు కూడా ఉండినాయి.”

స్టాలిన్ వ్యక్తిగత జీవితాన్ని పరిశీలిస్తే, స్టాలిన్ యువకుడిగా ఉన్నప్పుడే తనతో పాటు పనిచేస్తున్న సోషలిస్టు ఉద్యమకారుని చెల్లె (ఎకాటెరిన్ స్వామిడ్జ)తో పెండ్లి జరిగింది. ఒక బాబు పుట్టాడు. 1905 విప్లవ కాలంలో ఆమె మరణించింది. కొడుకును ఆమె తల్లి తండ్రులు పెంచుకున్నారు. తర్వాత స్టాలిన్ నడెజ్డా అల్లులుయేవాను రెండో వివాహం చేసుకున్నాడు. ఈమె తండ్రి స్టాలిన్‌కు బాగా సన్నిహితంగా ఉండే కార్మిక కామ్రేడ్. వారిద్దరి దాంపత్య జీవితం అన్యోన్యంగా కొనసాగింది. ఒక కొడుకును జర్మన్ సైన్యం బందీగా పట్టుకుని చంపివేసింది.

గర్జించు రష్యా, గాండ్రించు రష్యా అని శ్రీ శ్రీ కవితావేశంతో ఊగిపోయాడు. ‘స్టాలిన్ నీ ఎర్రసైన్యం’ అనే పాట ప్రపంచం అంతా మారుమోగింది. ఫాసిస్టు హిట్లర్‌ను, జర్మన్ దురాక్రమణ సైన్యాలను దునుమాడిన రష్యాన్ ఎర్ర సైన్యం ఎత్తుగడలు, అవి సాధించిన విజయాలు ప్రపంచ ప్రజలను ఉత్సాహపరుస్తూనే ఉంటాయి’ కా.స్టాలిన్ పీడిత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాడు.

# నూతన ప్రజాస్వామిక విప్లవ నేత
# కామ్రేడ్ మావో సే-టుంగ్

**(జననం: 26 డిసెంబర్, 1893 – మరణం: 9 సెప్టెంబర్, 1976)**



కామ్రేడ్ మావో పేరు వినగానే అనేక విషయాలు గుర్తుకు వస్తాయి. చైనా విప్లవాన్ని విజయవంతం చేసిన కామ్రేడ్ మావో నేతృత్వం గొప్పది. చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను, మావో జీవితాన్ని కలిపి ఆ విషయాలను అర్థం చేసుకోవాల్సి ఉంది.

"చైనా ప్రజలు చేపట్టిన మార్గం...చాలా వలస, పరాధీన దేశాల ప్రజలు తమ జాతీయ స్వాతంత్ర్యం కోసం, జనతా ప్రజాస్వామికం కోసం చేసే పోరాటంలో చేపట్టవలసిన మార్గం" అని 1950 జనవరి 27న కొమినిఫాం పత్రిక సంపాదకీయం రాసింది.

1949 అక్టోబరు విప్లవం విజయవంతం అయిన తరువాత చైనా పంథా అంతర్జాతీయ పంథాగా అనుసరించబడింది. కామ్రేడ్ మావో అంతర్జాతీయ నాయకుడుగా గుర్తింపు పొందాడు.

కామ్రేడ్ మావోగా ప్రసిద్ధి చెందిన మావో సే-టుంగ్ 1893 డిశంబర్ 26న హూనాన్ రాష్ట్రంలోని షావోషాన్ గ్రామంలో ఒక పేదరైతు కుటుంబంలో జన్మించాడు. ఒక ప్రైవేటు బడిలో ప్రాథమిక విద్యను అభ్యసించిన తరువాత క్సియాంగ్ క్సియాంగ్ కౌంటీలోను, రాష్ట్ర రాజధాని చాంగ్సా స్కూలులోను, హునాన్ ఫోర్తు ప్రొవిన్షియల్ నార్మల్ స్కూల్‌లోనూ ఉన్నత విద్య పూర్తి చేశాడు.

కుటుంబ సంబంధాల్లో పితృస్వామికంగా ఉండే తండ్రికి వ్యతిరేకంగా తల్లికి మద్దతుగా మావో పోరాటం చేశాడు. చిన్నతనం నుండి శారీరక దారుఢ్యం పట్ల శ్రద్ధ పెట్టేవాడు. ఈత కొట్టటంలో మంచి నేర్పరి. 18 ఏండ్ల వయస్సులో వ్యాయామ విద్య అవసరాన్ని చెబుతూ మంచి వ్యాసం రాశాడు. చిన్నతనం నుండి పెద్దవారు చెప్పిన కథలు వినడం వలన తైపింగ్ తిరుగుబాటులో రైతుల వీరోచిత పోరాటాలు, రైతాంగ పరిస్థితులను లోతుగా అర్థం చేసుకున్నాడు. ఇది తరువాత చైనా భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఎంతో తోడ్పడింది. పెకింగ్ లైబ్రరీలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పని

చేసిన కాలంలో మార్క్సిస్టు గ్రంథాలను అధ్యయనం చేసాడు. ఆ సమయంలో ఉన్న లైబ్రరీ నిర్వాహకుడు మార్క్సిస్టు కావడం, ఆయన కుమార్తె మావోకు చరిత్ర పట్ల అవగాహన కల్పించడంతో మావో అధ్యయనానికి ఎంతో ఉపకరించి విశాల దృక్పథం ఏర్పడడానికి, జీవిత లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవడానికి దోహదపడింది.

చైనా ప్రాచీన సాంప్రదాయ తత్వవేత్త కన్ఫ్యూషియస్ నుండి పశ్చిమ దేశాల నియో హెగేలియన్స్ వరకు అనేక తాత్విక రచనలను చదివిన మావోలో దేశం పట్ల ప్రగాఢమైన ప్రేమ, విప్లవం పట్ల అచంచల విశ్వాసం ఉండేది. డాక్టరు సన్‌యెట్‌సేన్ నాయకత్వంలో 1911లో చైనాలో బూర్జువా విప్లవం విజయవంతం అయ్యింది. 1913లో ఆ తిరుగుబాటుదారులు నిర్మించిన నూతన సైన్యంలో మావో 6 నెలలు పని చేసి అనుభవం సంపాదించాడు. ప్రజలకు సైన్యం అవసరాన్ని గుర్తించాడు.

మావో తొలినాళ్ళ రాజకీయ జీవితం మార్క్సిజాన్ని అధ్యయనం చేయడం, ప్రచారాందోళనల్లో చురుగ్గా పాల్గొనడం, అందుకు అవసరమైన పత్రిక నిర్వహణ, నిర్మాణ కార్యకలాపాలను స్వతంత్రంగా సృజనతో చేపట్టడంగా కొనసాగింది.

వివిధ సెక్షన్ల ప్రజలతో ప్రజాస్వామికంగా చర్చించి, రాజకీయంగా చైతన్యపరుస్తూ భావసారూప్యతను సాధించాడు. చింగ్‌షాలో నూతన ప్రజా సమాజాన్ని (1918లో) ఏర్పాటు చేసి స్వతంత్రంగానే నడిపాడు. 1919 మే 4 ఉద్యమం నాటికి విద్యార్థి యువజన వర్గాల్లో గుర్తింపు పొందిన నాయకుడుగా చురుగ్గా పాల్గొన్నాడు. విప్లవ భావాల ప్రచారం కోసం "కియాంగ్స్ కియాంగ్స్ వ్యూ" అనే పత్రికను నిర్వహించాడు. ఆ వెంటనే సాంస్కృతిక అధ్యయన సమాజాన్ని స్థాపించాడు. చాంగ్షాలో కమ్యూనిస్టు గ్రూపును ప్రారంభించాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరుగా కామ్రేడ్ మావో 1921లో జరిగిన మొదటి జాతీయ కాంగ్రెసులో ప్రతినిధిగా పాల్గొన్నాడు. హూనాన్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు.

పార్టీ నాయకుడుగా కామ్రేడ్ మావో చాంగ్షా, అన్ హుయి కార్మికోద్యమాలకు నాయకత్వం వహించాడు. 1923లో జరిగిన సి.పి.సి. 3వ జాతీయ కాంగ్రెస్ జాతీయ ఐక్య సంఘటనకు పిలుపునిచ్చింది. సన్‌యెట్‌సేన్ నాయకత్వంలోని కొమింగ్‌టాంగ్ పార్టీతో కలిసి పని చేయడానికి నిర్ణయించింది. 1924, 26లలో జరిగిన రెండు కొమింగ్‌టాంగ్ జాతీయ కాంగ్రెస్‌లలో కామ్రేడ్ మావోను ఉన్నత నాయకత్వంలోకి తీసుకుని ప్రచారశాఖ బాధ్యతలు ఇచ్చారు. రాజకీయ పత్రికకు సంపాదకుడుగా ఉంటూ, రైతు ఉద్యమ శిక్షణలో నిర్దేశకత్వం అందించాడు. 1924-26 మధ్య కాలంలో కార్మిక వర్గం, రైతాంగం సాగించిన గొప్ప పోరాటాలతో చైనా విప్లవం వేగంగా

పురోగమించింది. 1925 మే 30 సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో అన్ని సెక్షన్ల ప్రజలు పాల్గొన్నారు. ఆ పోరాటాలకు స్థానికంగా మార్గదర్శకత్వం అందిస్తూ కామ్రేడ్ మావో ఒక మంచి నాయకుడుగా అభివృద్ధి చెందాడు.

చాలా ప్రాంతాల్లో సాయుధ ఘర్షణలకు దారితీసిన కార్మిక వర్గ ప్రజా తిరుగుబాట్లకు తోడు లక్షలాది సభ్యత్వాలతో హూనాన్, హూపే, కియాంగ్సీ రాష్ట్రాల్లో రైతాంగ ఉద్యమాలు అభివృద్ధి అయ్యాయి. ఒక్క హూనాన్ రాష్ట్రంలోనే 3 లక్షల మందితో రైతుకూలీ సంఘం, లక్ష మందితో రైతాంగ ఆత్మరక్షణ పటాలం ఏర్పడ్డాయి.

1925లో డాక్టర్ సన్‌యెట్‌సేన్ మరణానంతరం కొమింగ్‌టాంగ్ పార్టీ నాయకత్వాన్ని చాంగ్ కై షేక్ చేజిక్కించుకుని కమ్యూనిస్టు పార్టీపై ఊచకోతకు పూనుకున్నాడు.

చైనా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి చెంటూషి మితవాద అవకాశవాదం కార్మిక వర్గ నాయకత్వాన్ని గుర్తించలేదు. బూర్జువా వర్గంపై భ్రమలతో, మొదటి అంతర్యుద్ధం కాలంలో తప్పుడు ఎత్తుగడల కారణంగా పార్టీ, విప్లవోద్యమం తీవ్రమైన నష్టాలకు, అనేక రకాల కష్టాలకు గురయ్యాయి. 1927 మొదటి అంతర్యుద్ధం వైఫల్యం తరువాత చైనాలో వర్గ సమీకరణలు మారాయి. బడాబూర్జువా వర్గం సామ్రాజ్యవాదంతోనూ, భూస్వామ్యం (యుద్ధ ప్రభువుల)తోనూ కలిసి విప్లవ ప్రతీఘాతుక శక్తిగా కమ్యూనిస్టు పార్టీపై దాడులు కొనసాగించింది. 1928 జనవరి నుండి ఆగష్టు వరకు 8 నెలల కాలంలో లక్ష మంది కార్మికులు, రైతులు హత్యకు గురయ్యారు. దారుణమైన నిర్బంధంతో పాటు ప్రజలు తీవ్ర స్థాయిలో దోపిడీకి గురయ్యారు. తరువాత చింగ్‌కువోటాంగ్ అతివాద విధానాలు రైతాంగాన్ని నిర్లక్ష్యం చేయడం ఉద్యమానికి మరల తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఈ క్రమంలోనే చైనాలో రైతాంగ పాత్రను అధ్యయనం చేయడంతో కామ్రేడ్ మావో సైద్ధాంతిక, రాజకీయ కృషి ప్రారంభమైంది. అది మార్క్సిస్టు సిద్ధాంత అభివృద్ధికి ఎంతో దోహదం చేసింది.

1926 మార్చిలో చేసిన “చైనా సమాజంలోని వర్గ విశ్లేషణ” ఆధారంగా 1927 మార్చిలో “హూనాన్ రైతు ఉద్యమంపై నివేదిక”ను సమర్పించాడు. లెనిన్ థీసిస్ “వలసలలోని జాతీయ విప్లవం”పై ఆధారపడి సరియైన మార్క్సిస్టు, లెనినిస్టు దృక్పథం పద్ధతులను అనుసరించి నూతన ప్రజాస్వామిక విప్లవానికి సంబంధించిన మౌలిక భావాలను అభివృద్ధిపరిచాడు.

వైఫల్యాల నుండి తీసిన గుణపాఠాల వెలుగులో ఎర్రసైన్యాన్ని నిర్మించేందుకు 1928లో కామ్రేడ్ మావో “చైనాలో ఎర్రరాజ్యాధికారం ఎలా మనగులుగుతుంది?” “చింకాంగ్ కొండల్లో పోరాటం” అనే చారిత్రక రచనలు చేసి సైద్ధాంతిక ప్రాతిపదికను

ఏర్పరచాడు. అది వలస, అర్ధవలస దేశాల్లో దీర్ఘ కాల ప్రజాయుద్ధ పంథాకు పునాదిగా ఉంది. ఆ పంథాకు ఆచరణ రూపం ఇచ్చే క్రమంలోనే విప్లవ స్థావర ప్రాంతాలను నిర్మాణం చేసి సోవియట్లు ఏర్పాటు చేసి "చైనా సోవియట్ రిపబ్లిక్ తాత్కాలిక ప్రభుత్వాన్ని" ఏర్పరచాడు.

1930 నాటికి చింకాంగ్ పర్వతాల్లోని కేంద్ర స్థావర ప్రాంతం, అనేక రాష్ట్రాల్లో స్థావర ప్రాంతాలు, ప్రజా సాయుధ శక్తులు 60 వేల సంఖ్యలో ఏర్పడ్డాయి. అతి కొద్దికాలంలోనే ఆ సంఖ్య లక్షకు చేరింది. చాంగ్‌కైషేక్ యుద్ధ ప్రభువులకు మధ్యనున్న అంతరంగిక ముఠా కక్షల్ని, ఘర్షణలను వినియోగించుకుని విప్లవ శక్తులు బలపడ్డాయి.

ఈ విజయాలు మరల పార్టీలో అతివాదాన్ని తెచ్చి నష్టపరిచాయి. లీలీషాన్ నాయకత్వంలో పట్టణాల్లో తిరుగుబాట్లకు ప్రాధాన్యతనిచ్చిన దుస్సాహసిక పథకం, అలాగే వాంగ్‌మింగ్ నాయకత్వంలోని 3వ అతివాద పంథా–గెరిల్లా యుద్ధతంత్రాన్ని, చలన యుద్ధతంత్రాన్ని నిర్లక్ష్యం చేసి స్థావర యుద్ధతంత్రం చేపట్టి అనేక నష్టాలకు గురిచేసాయి. 2వ అంతర్యుద్ధంలో 4 చుట్టివేత దాడులను ఓడించిన ఎర్రసైన్యం 10 లక్షల సైన్యంతో జరిగిన 5వ చుట్టివేతలో ఓటమి పాలైంది. 1927 నుండి 1935 మధ్య కాలంలో 3 లక్షల మంది ప్రజలు ఊచకోతకు గురయ్యారు. ఓటమి నుండి విజయాలవైపు పురోగమించే క్రమంలో 1934 అక్టోబరులో వ్యూహాత్మక మలుపుగా పిలువబడే చారిత్రక దీర్ఘ యాత్ర – లాంగ్‌మార్చ్‌కు–పిలుపు ఇవ్వడంతో శత్రు వలయాన్ని ఛేదించుకుంటూ ఎర్రసైన్యం ఉత్తరం వైపుకు పురోగమించింది. 11 రాష్ట్రాల్లో 12 వేల కిలో మీటర్ల దూరాన్ని 12 నెలల పాటు దీర్ఘయాత్ర చేసిన ఎర్రసైన్యం సంఖ్య రీత్యా బాగా తగ్గినా రాజకీయంగా, నిర్మాణపరంగా పటిష్టవంతం అయ్యింది. దేశవ్యాప్తంగా విస్తృత ప్రభావాన్ని వేసింది. సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ భావాన్ని కల్పించింది. ప్రపంచ విప్లవోద్యమ చరిత్రలో "చైనా లాంగ్‌మార్చ్" ఒక గొప్ప ఉత్తేజకరమైన సంఘటనగా నిలిచిపోయింది. ఈ కాలంలోనే 1935 జనవరిలో జరిగిన సున్‌యి మహాసభలో కామ్రేడ్ మావోకు పార్టీపై సంపూర్ణ ఆధిపత్యం లభించింది. లాంగ్‌మార్చ్ కాలంలో దారిపొడవునా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ "విత్తనాలను వెదజల్లిన యంత్రం"గా రాజకీయ కృషి చేసింది.

చైనా కమ్యూనిస్టు పార్టీ ఎదుర్కొంటున్న సమస్యల పట్ల 3వ ఇంటర్నేషనల్ శ్రద్ధ చూపినా వలస, అర్ధ వలసల్లో విప్లవాలను అర్థం చేసుకోవడం, అభివృద్ధి చేయడంలో వెనుకబడి ఉంది. 1935లో మావో నాయకత్వం నెలకొనే వరకు చైనాలో ఆధిపత్యం వహించిన మితవాద, అతివాద పంథాలను సకాలంలో సరిదిద్దలేకపోయింది.

**జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా ఎత్తుగడలు :**

కామ్రేడ్ మావో ఈ కాలంలో మార్క్సిస్టు, లెనినిస్టు ఐక్యసంఘటన ఎత్తుగడలను అభివృద్ధి పరిచాడు. చైనా అంతర్గత, బహిర్గత వైరుధ్యాలను అత్యంత ప్రతిభతో విశ్లేషించి జపాన్ దురాక్రమణతో ప్రధాన వైరుధ్యం మారిన విషయాన్ని చెబుతూ "జపాన్ వ్యతిరేక విశాల ప్రజా ఐక్యసంఘటన ఎత్తుగడలను" రూపొందించాడు. మార్క్సిస్టు తత్వశాస్త్రంలో గతితార్కిక నియమాలను అందులో వైరుధ్య అంశాన్ని లోతుగా అధ్యయనం చేసి విస్తృతంగా వివరించి వైరుధ్య నియమాన్ని అభివృద్ధి పరిచాడు.

ప్రధాన వైరుధ్యం మారిందని గుర్తించిన మావో వ్యూహాన్ని మార్చి నూతన ఎత్తుగడలతో వ్యూహాత్మకంగా జపాన్‌తో వ్యవహరించడంతో వేలసంఖ్యలో ఉన్న ఎర్రసైన్యం జపాన్ యుద్ధం ముగిసేనాటికి లక్షలలోకి పెరిగింది. (1937లో 20 వేల నుండి 1945 వరకు 10 లక్షలకు చేరింది.) మావో రాసిన "చైనా విప్లవ యుద్ధంలోని వ్యూహాత్మక సమస్యలు" మార్క్సిస్టు–లెనినిస్టు మిలటరీ విజ్ఞాన శాస్త్రాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయిస్తూ రాసినది. "జపాన్ వ్యతిరేక గెరిల్లా యుద్ధంలోని వూహాత్మక సమస్యలు" "దీర్ఘకాల ప్రజాయుద్ధం గురించి" చేసిన రచనలు మొత్తం కలిపి మార్క్సిస్టు మిలటరీ విజ్ఞాన శాస్త్రాన్నే నూతన స్థాయికి తీసుకవెళ్ళాయి. చైనా విప్లవానికి మార్గదర్శకత్వం అందించడమేగాక ప్రపంచ వ్యాప్తంగా జాతీయ విముక్తి యుద్ధాలకు పునాదులను వేశాయి.

ఇదే కాలంలో పార్టీలో బలంగా ప్రభావం చూపుతున్న స్వీయాత్మక/పిడివాదం/కార్మికవర్గేతర భావజాలాల్ని ఓడించడానికి మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతాన్ని ఆచరణ అనే వ్యాసంలో వివరంగా చెప్పి సార్వత్రిక మార్క్సిస్టు తాత్విక భావనను అభివృద్ధిపరిచి, సరళ రీతిలో వివరించి అంతర్జాతీయ కార్మిక వర్గానికి ఎంతో దోహదం చేసాడు. సరైన భావాలు ఎక్కడ నుండి వస్తాయో వివరించాడు.

మావో దీర్ఘ దృష్టి గొప్పది. జపాన్ వ్యతిరేక యుద్ధం ముగిసిన వెంటనే జరిగిన సి.పి.సి. 7వ కాంగ్రెస్‌లో "మిశ్రమ ప్రభుత్వం గురించి" అనే నివేదికను సవరిస్తూ కొమింగ్‌టాంగ్‌తో మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటుకు నిర్దిష్ట కార్యక్రమాన్ని ఇచ్చాడు. అమెరికా అండతో చాంగ్‌కైషేక్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించి 3వ అంతర్యుద్ధం మొదలు పెట్టాడు. "అంతర్యుద్ధం వద్దని చాంగ్‌కైషేక్‌తో సహకరించాలి లేకుంటే చైనా జాతి నశించిపోతుందని" స్టాలిన్ ఇచ్చిన సలహాను చైనా ప్రస్తుత పరిస్థితులకు పొసగదని గుర్తించిన మావో అంతర్యుద్ధాన్ని కొనసాగించాలనే నిర్ణయించాడు. చైనా

కమ్యూనిస్టు పార్టీ ఎర్రసైన్యం 4 సంవత్సరాల పాటు పోరాడి విప్లవ ప్రతీఘాతుక దాడులను ఓడించి దేశ వ్యాపిత విజయాన్ని సాధించింది.

1949లో సి.పి.సి. 28వ జన్మదిన వార్షికోత్సవంలో "ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వం గురించి" ప్రసంగిస్తూ మనం విప్లవ యుద్ధంలో మౌలిక విజయం సాధించామని ప్రకటించాడు. అయితే ఇది మొత్తం ప్రయాణంలో మొదటి అడుగు మాత్రమేనని గుర్తు చేశాడు. 1949 అక్టోబర్ 1న కొత్తరాజ్యం అవతరించింది. కామ్రేడ్ మావో ఈ సందర్భంగా యావత్ ప్రపంచానికి సందేశం ఇస్తూ చైనా ప్రజా గణతంత్ర స్థాపనని, కేంద్ర ప్రజా ప్రభుత్వ స్థాపనను ప్రకటించాడు.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా జరిగిన సైద్ధాంతిక చర్చ "గ్రేట్ డిబెట్"గా ప్రసిద్ధి పొందింది. "శాంతియుత పరివర్తన, శాంతియుత పోటీ, శాంతియుత సహజీవనం" అనే కృశ్చేవ్ వర్గ సంకర రాజకీయాలను ఖండిస్తూ, వర్గపోరాట ప్రాధాన్యతను వివరించాడు. పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదాన్ని గుర్తించి అంతర్జాతీయంగా మావో జరిపిన సిద్ధాంత పోరాటం మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు కార్మిక వర్గ నియంతృత్వం ఆవశ్యకతను మరింత దృఢతరం చేసింది. సోవియట్ యూనియన్‌లో కృశ్చేవ్ ముఠా కామ్రేడ్ స్టాలిన్‌పై చేసిన దుష్ప్రచార దాడిని ఖండించి, కామ్రేడ్ స్టాలిన్‌లో ఉన్న విప్లవకర లక్షణాలను వివరిస్తూ, నిజమైన విప్లవకారుడుగా నిర్ధారిస్తూ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో స్టాలిన్ పాత్రను గుర్తింపజేశాడు.

అదే సందర్భంలో సోషలిస్టు సమాజంలోకి పరివర్తన చెందాక వర్గపోరాటాన్ని నిర్లక్ష్యం చేయటాన్ని, ఉత్పత్తి శక్తుల సిద్ధాంతాన్ని ఖండిస్తూ, వాటికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడాడు. "సోషలిస్టు సమాజపు అభివృద్ధికి వర్గపోరాటం కీలకమని" నొక్కి చెప్పాడు.

చైనాలో గొప్ప ముందంజ, ప్రజా కమ్యూన్‌ల అవతరణ, దిద్దుబాటు ఉద్యమం పురోగమించడంతో పార్టీలోని లీషావ్‌చీ లాంటి శక్తులు ఆత్మరక్షణలోకి నెట్టబడ్డాయి. ప్రజా కమ్యూన్లు సోషలిస్టు సమాజపు రాజ్యాధికార మౌలిక నిర్మాణంగా అభివృద్ధి చెందాయి.

కామ్రేడ్ మావో "సాంస్కృతిక విప్లవం" అనే ఒక నూతన రూపాన్ని అభివృద్ధి చేశాడు. పార్టీలో, అధికారంలో ఉండి పెట్టుబడిదారీ మార్గాన్ని చేపట్టిన వారిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఆ ఉద్యమం కొనసాగింది. విప్లవంలో ప్రజాపంథాను అమలు చేయడం, అభివృద్ధి చేయడంతో పాటు రాజకీయాలను ఆధిపత్య స్థానంలో

ఉంచడంతో కేడర్, సైన్యం, ప్రజల మధ్య త్రిముఖ మైత్రి అభివృద్ధి చెంది గొప్ప శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం పురోగమించింది. ఇది అంతర్జాతీయ కార్మిక వర్గ సిద్ధాంత ఆయుధాగారానికి సమకూరిన అత్యంత ముఖ్యమైన ఆయుధం అయ్యింది. వర్గపోరాటం, కార్మిక వర్గ నియంతృత్వాలతో పాటు ఉపరితలంలో వర్గపోరాటాన్ని గుర్తించడం విప్లవకారుల నేటి కర్తవ్యంగా గుర్తించబడుతుంది.

సోషలిస్టు నిర్మాణ కాలమంతటా ప్రత్యేకించి సాంస్కృతిక విప్లవ కాలంలో ఆర్థిక పునాది–ఉపరితలాల మధ్య, ఆర్థిక రాజకీయాల మధ్య సరైన గతితార్కిక సమతులనాన్ని నెలకొల్పే వైఖరిని చేపట్టాడు. ప్రజల పాత్రకు ప్రాధాన్యతను ఇస్తూ "విప్లవాన్ని అర్థం చేసుకోవాలి–ఉత్పత్తిని పెంచాలి" అనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు.

"నూరు పువ్వులు వికసించనివ్వండి–వెయ్యి ఆలోచనలు సంఘర్షించనీయండి" అనే దిద్దుబాటు ఉద్యమం, సోషలిస్టు ఎడ్యుకేషన్ ద్వారా ప్రజా బాహుళ్యాన్ని మితవాదులకు వ్యతిరేకంగా సమీకరించాడు. "ప్రజల మధ్య వైరుధ్యాలతో సక్రమంగా వ్యవహరించే తీరు" అనే రచనలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలుకు ప్రజాపంథా గ్యారెంటీ ఇస్తుందని స్పష్టపరిచాడు.

సోషలిస్టు సమాజ నిర్మాణం, కమ్యూనిజానికి పురోగమించడం గురించి చెబుతూ కామ్రేడ్ మావో రష్యా అనుభవంలో 5 ప్రధాన పొరపాట్లను పేర్కొన్నాడు.

1. ఉత్పత్తి సంబంధాలకు, ఉత్పత్తి శక్తులకు మధ్య ఉన్న వైరుధ్యానికి తగినంత ప్రాధాన్యతను ఇవ్వలేదు; 2. సోషలిస్టు నిర్మాణంలో ప్రజాపంథాను అనుసరించలేదు; 3. వర్గ పోరాటాన్ని నిర్లక్ష్యం చేశారు; 4. భారీ పరిశ్రమలకు ప్రాధాన్యతను ఇచ్చి అందులోని ప్రధాన వైరుధ్యాన్ని గుర్తించలేదు. పరిశ్రమలకు, వ్యవసాయానికి మధ్య సమతులనం లేదు; 5. రైతుల పట్ల అపనమ్మకం కొనసాగింది.

రష్యా అనుభవం నుండేకాక చైనా అనుభం నుండి కూడా అనేక గుణపాఠాలు తీసి సోషలిస్టు నిర్మాణానికి అన్వయించడంతో మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతం గొప్పగా పురోగమించింది.

కార్మిక వర్గపు వర్గపోరాట ఎత్తుగడలను చైనా విప్లవ నిర్దిష్ట పరిస్థితులకు కామ్రేడ్ మావో శాస్త్రీయంగా అన్వయింపజేశాడు. నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఐక్యసంఘటన, సాయుధ పోరాటం, పార్టీ నిర్మాణం అనే మూడు మంత్రదండాలను గొప్పగా సమన్వయించాడు. ఐక్యసంఘటన అంటే సాయుధ పోరాటాన్ని నిర్వహించేందుకు ఉపయోగపడే ఐక్యసంఘటనగానూ, పార్టీ అంటే ఐక్యసంఘటన ప్రజాసైన్యం అనే రెండు ఆయుధాలను ధరించిన వీరయోధగా మావో వివరించాడు.

మూడు మంత్రదండాలను గొప్పగా అభివృద్ధి చేసి మార్క్సిస్టు అవగాహనను నూతన స్థాయికి అభివృద్ధి చేశాడు. పార్టీ పని విధానాన్ని తాత్వికంగా చర్చించి సరిదిద్దడంతో పాటు సూత్ర రీత్యా క్రమబద్ధీకరించడం చేశాడు.

రెండు పంథాల మధ్య పోరాటానికి మావో ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చాడు. "వర్గాలు ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీలో సరైన భావాలకు, తప్పుడు భావాలకు మధ్య వైరుధ్యం సమాజం లోపల వర్గ వైరుధ్యాల తాలూకు ప్రతిబింబాలే" అని స్పష్టంగా చెప్పాడు.

"తత్వశాస్త్రం మాయజాలం కాదు" అని చైనా రైతాంగానికి వైరుధ్య నియమాన్ని సరళం చేసి అందించిన కామ్రేడ్ మావోకు ప్రపంచ పరిణామాల పట్ల సమగ్రత, శాస్త్రీయత ఎంత గొప్పగా ఉన్నాయో మనకు స్పష్టమవుతోంది. ప్రపంచ సోషలిస్టు విప్లవోద్యమంలో మార్క్సిజం-లెనినిజం అభివృద్ధే మావోయిజంగా గుర్తించి ఆచరిస్తున్నాం. 1976లో సెప్టెంబర్ 9న కామ్రేడ్ మావో అమరుడయ్యాడు. ఆయన ప్రపంచ సోషలిస్టు విప్లవానికి చేసిన సైద్ధాంతిక రాజకీయ కృషి మనల్ని నడిపిస్తుంది.

మావో వ్యక్తిగత జీవితానికి వస్తే-మావోకు 14 సంవత్సరాల వయస్సులో తండ్రి అదే గ్రామంలో ఒక అమ్మాయితో వివాహం నిర్ణయం చేశాడు. ఆ వివాహాన్ని మావో ఎప్పుడూ గుర్తించలేదు. బీజింగ్‌లో ఉన్నప్పుడు హైస్కూలు టీచరు కూతురు యాంగ్‌కుయిహుయి అనే యూనివర్సిటీ విద్యార్థిని మొదటి పెండ్లి చేసుకున్నాడు. ఆమెను కొమింగ్‌టాంగ్ బలగాలు హత్య చేశాయి. తరువాత హెలిజన్‌ను జియాంగ్సీలో ఉన్న కాలంలో పెండ్లి చేసుకున్నాడు. ఆమె సహకరించకపోవడంతో ఆమెకు విడాకులు ఇచ్చాడు. తరువాత యానాన్‌లో ఉన్న కాలంలో నటి లాన్‌పింగ్‌ను పెండ్లి చేసుకున్నాడు. ఆమె తరువాత కాలంలో జియాంగ్‌జింగ్‌గా సాంస్కృతిక విప్లవ కాలంలో చురుగ్గా పని చేసిన విషయం తెలిసిందే.

కామ్రేడ్ మావో అంటే దీర్ఘకాల ప్రజాయుద్ధం, గెరిల్లా యుద్ధవ్యూహం, నూతన ప్రజాస్వామిక విప్లవం, లాంగ్‌మార్చ్, మూడు మంత్రదండాలు, రెండు పంథాల మధ్య పోరాటం, ప్రజాపంథా, చైనా అక్టోబర్ సోషలిస్టు విప్లవం, గొప్ప శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం...ఇంకా గ్రేట్‌డిబెట్, ఇలా ఎన్నో ఎన్నో విజ్ఞానాంశాల సమాహారం.

**సోషలిజమే ప్రత్యామ్నాయం**

**ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి.**

Marxist Mahopaadhyayula Jeevana Rekhalu - Virasam



మార్క్సిజం శ్రామిక వర్గ దృక్పథం. వర్గరహిత సమాజ స్థాపనకు వర్గపోరాట సిద్ధాంతంగా విప్లవాత్మక ప్రాతిపదికను అందించింది. స్థలకాల సంబంధంలో నిరంతరం రాటుదేలిన మార్క్సిజం అత్యుత్తమ విజ్ఞానశాస్త్రంగా నిరూపితమైంది.

సమాజాభివృద్ధికి అనుగుణంగా మార్క్సిజం లెనినిజంగానూ, లెనినిజం మావోయిజంగానూ గుణాత్మకంగా అభివృద్ధి చెందిన వర్గపోరాట సిద్ధాంతం ప్రపంచ కార్మిక వర్గం చేతికి అద్భుతమైన ఆయుధమై ఎంతో పురోగమించింది.